



శ్రీచరణికి స్వాగతం

స్వాగతం పలుకుతున్న మంత్రులు అనిత, సవిత, సంధ్యారాణి, ఎంపీ చిన్ని

గన్నవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వరల్డ్ కప్‌లో విజయం సాధించి తొలిసారి గన్నవరం విమానాశ్రయానికి విచ్చేసిన మహిళా క్రికెటర్ శ్రీచరణికి అపూర్వ స్వాగతం లభించింది. ఎయిరిండియా విమానంలో ఢిల్లీ నుంచి శుక్రవారం ఉదయం ఆమె ఇక్కడికి విచ్చేశారు. మంత్రులు వంగలపూడి అనిత, ఎస్.సవిత, గుమ్మిడి సంధ్యారాణి, ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీష్‌బాబు, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, శాప్ చైర్మన్ ఏ.రవినాయుడు, మాజీ కెప్టెన్ మిథాలీరాజ్, క్రికెట్ సెలక్షన్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎంఎస్‌కే ప్రసాద్ తదితరులు స్వాగతం పలికారు. పలు కళాశాలలు, పాఠశాలలు, అకాడమీలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వందేమాతరం.. అంటూ నినాదాలు చేశారు. అనంతరం రోడ్డు మార్గాన శ్రీచరణి సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లారు.

విజయగీతిక

వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లావ్యాప్తంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలల్లో ప్రత్యేకంగా గేయాలాపన చేశారు. గుడివాడలోని ఓ కళాశాలలో వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) విజయవాడలోని ఓ కళాశాలలో జాతీయ జెండాతో ముస్లిం విద్యార్థిని





కష్ట పరిహారం

మొంథా పంట నష్టపరిహారంపై రైతుల్లో ఆందోళన

నేలవాలిన పంటకే పరిహారం అంటున్న కొందరు అధికారులు

- పొడైపోయిన వరి గింజల పరిస్థితి ఏమిటంటున్న రైతులు
- తెల్లగా మారుతున్న వరికీ పరిహారం ఇవ్వాలని వేడుకోలు
- చింతలమడలో సక్రమంగా నమోదు చేయలేదని ఆందోళన
- అంచనాల తయారీ చివరి దశలో ఉందంటున్న అధికారులు

మొంథా తుఫాను మిగిల్చిన నష్టం నుంచి రైతులు బయటపడతారా? పంటనష్టం నమోదు ప్రక్రియను అధికారులు సక్రమంగా నమోదు చేస్తారా? అనే ప్రశ్నలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. బలమైన గాలుల తాకిడికి ఈత దశలోని వరి సుంకు నుంచి రాలిపోయిందని, గింజలు పాలుపోసుకోవడం లేదని, పగిలి తెల్లగా మారుతున్నాయని రైతులు చెబుతుండగా, కేవలం నేలవాలిన పంటనే నష్టపరిహారం జాబితాల్లో నమోదు చేస్తామని కొందరు వ్యవసాయ అధికారులు పేర్కొనడంతో రైతుల్లో ఆందోళన నెలకొంటోంది.



చల్లపల్లి మండలం చింతలమడలో రైతుల ఆందోళన



మచిలీపట్నం మండలం హుస్సేన్‌పాలెంలో నేలవాలిన వరి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మొంథా తుఫాను ప్రభావానికి జిల్లాలోని 427 గ్రామాల్లోని 46,357 హెక్టార్లలో వరి, ఇతర పంటలు దెబ్బతిన్నట్టుగా అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వేరుశెనగ 288.2 హెక్టార్లలో, మినుము 985 హెక్టార్లలో, పత్తి 43 హెక్టార్లలో, మొక్కజొన్న 4 హెక్టార్లలో.. మొత్తంగా 46,357 హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్టుగా ప్రభుత్వానికి నివేదిక పంపారు. వరికంకులు పాలుపోసుకునే దశలో, కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో 45,040 హెక్టార్లలో నాశనమైనట్టుగా చూపారు. గాలుల కారణంగా ఈతదశలో ఉన్న వరిపంట సుంకు రాలిపోయిందని, దీంతో గింజలు పగిలి సగానికిపైగా పాలు పోసుకోలేదని, తప్పలుగా మారాయని రైతులు చెబుతున్నారు. పైరు నిలబడి ఉన్నప్పటికీ ఈ తరహా నష్టం కారణంగా దిగుబడి తగ్గుతుందని అంటున్నారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించి 50 శాతం మేర వరి దెబ్బతిన్నట్టుగా గుర్తించారని పేర్కొన్నారు. పైరు నిలబడే ఉన్నప్పటికీ, మిగతా 6లో..

చింతలమడ రైతుల ఆందోళన

గాలులకు నేలవాలిన వరిపైరుతో పాటు నిలబడి ఉండి, సుంకు రాలిపోయి, గింజలు గట్టిపడని పైరును నష్టపరిహారం జాబితాల్లో నమోదు చేస్తున్నారు. కానీ, చల్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వరిపైరు నిలబడి ఉన్నా.. తెల్లకంకులుగా మారి దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉన్న పంటను జాబితాల్లో నమోదు చేయట్లేదు. ఇతర ప్రాంతాల్లో తెల్లకంకులు వచ్చి దిగుబడి తగ్గే అవకాశం ఉన్న పంటను జాబితాల్లో నమోదు చేస్తున్నారనే విషయాన్ని తెలుసుకున్న చల్లపల్లి మండలం చింతలమడ గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు.

ఆలయ స్థలం ఆక్రమణ

గుడివాడ వేణుగోపాలస్వామి స్థలంపై కన్ను



వేణుగోపాలస్వామి ఆలయానికి దాత విరాళంగా ఇచ్చిన స్థలం

- స్థలంలోని పెంకుటిల్లు కూల్చే ప్రయత్నం
- చైర్మన్, ఈవో చొరవతో అడ్డగింపు
- దేవదాయ ట్రిబ్యునల్‌లో కేసు.. స్టేటస్ కో

ఆంధ్రజ్యోతి-గుడివాడ : స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన రూ.30 లక్షల విలువైన స్థలం కబ్జా కాకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి, ధర్మకర్తల మండలి చైర్మన్ అడ్డుకున్నారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయానికి 1948లో ఘంటసాల కృష్ణమూర్తి అనే దాత తన తండ్రి శేషాచలం జ్ఞాపకార్థం 141 గజాల ఇంటి స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ఆలయానికి ఎదురుగా ఉన్న ఈ స్థలాన్ని రిజిస్టర్ వీలునామా ద్వారా అందజేశారు. భగవత్ నగావతి, శ్రీరామానుజాచార్యులు, ఆళ్వార్ మండపాల నిర్మాణానికి, ఆ తర్వాత దేవస్థానానికి చెందేలా ఈ భూమిని రిజిస్టర్ మిగతా 6లో..

కబ్జా ఇలా..

ఈ స్థలంపై సరిహద్దున ఉన్న గ్రంధి లక్ష్మీ కన్ను పడింది. ఇటీవల జేసీబీ, కూలీలను పెట్టి ఆ స్థలంలోని పెంకుటిల్లును ధ్వంసం చేసేందుకు ఆమె ప్రయత్నించింది. సమాచారం అందుకున్న ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ అంగడాల సతీష్.. అక్కడికి చేరుకుని పనులను నిలుపుదల చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. ఈ దశలో చైర్మన్, ఈవో.. పూర్తిస్థాయి రికార్డులతో దేవదాయ శాఖ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ట్రిబ్యునల్.. దేవస్థానానికి అనుకూలంగా స్టేటస్‌కో ఇచ్చింది.

ఆలయానికి చెందిన స్థలమే

ఆలయంలోని మండపాల అభివృద్ధికి 1948లో కృష్ణమూర్తి అనే దాత ఆ స్థలం ఇచ్చారు. లక్ష్మి అనే మహిళ దౌర్జన్యంగా ఆ పెంకుటిల్లును ధ్వంసం చేసేందుకు ప్రయత్నించగా, ధర్మకర్తల సహాయంతో నిలుపుదల చేయించి దేవదాయ శాఖ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాం. **- ఈవో గోపాలరావు**

ఆలయ స్థలాల పరిరక్షణే ధ్యేయం

ఆలయాలకు చెందిన ఆస్తుల పరిరక్షణే బీజేపీ ధ్యేయం. వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన స్థలాన్ని కాపాడాం. **- చైర్మన్ అంగడాల సతీష్**

మాట్లాడుతున్న ఈవో శీనానాయక్, చైర్మన్ రాధాకృష్ణ



సీఎం సూచనల మేరకు దుర్గగుడి అభివృద్ధి

- దసరా తరహాలోనే భవానీ దీక్షల విరమణ ఉత్సవాలు
- మల్లేశ్వరస్వామి ఆలయ గోపురానికి బంగారు తాపడం
- దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ వెల్లడి

ఇంద్రకీలాద్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి చేపట్టి, భక్తులకు పెద్దపీట వేస్తామని చైర్మన్ బొర్రా రాధాకృష్ణ తెలిపారు. వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డిలో ఉన్న ఆలయ సమావేశపు కార్యాలయంలో పాలకమండలి మొదటి సమావేశం శుక్రవారం జరిగింది. 24 అంశాలపై చర్చించారు. అనంతరం చైర్మన్‌తో పాటు ఈవో శీనానాయక్ మీడియాతో మాట్లాడారు. తొలుత చైర్మన్ మాట్లాడుతూ భవానీ దీక్ష విరమణలకు పెద్ద ఎత్తున భవానీలు తరలిరానున్నారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. దసరా ఉత్సవాల తరహాలోనే భవానీ దీక్ష విరమణల్లో కూడా అన్ని ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేసి మిగతా 6లో..

ఒక్కొక్కరుగా నకిలీలు

నకిలీ మద్యం కేసులో బయటపడుతున్న నిందితులు

నకిలీ మద్యం తయారీ కేసులో నలుదిక్కుల్లో మూలాలు బయటకొస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఒక్కొక్కరు చేసిన పనులపై ఎక్సైజ్, సిట్ అధికారులు ఆధారాలు సేకరిస్తున్నారు. కోర్టు ద్వారా కస్టడీలోకి తీసుకుంటుండంతో నిందితుల సంఖ్య భారీగానే పెరుగుతోంది. తాజాగా శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు మరో ఏడుగురిని కస్టడీలోకి తీసుకున్నారు.

- తాజాగా ఏడుగురిని కస్టడీకి తీసుకున్న ఎక్సైజ్
- కీలక ఆధారాలు సేకరించే పనిలో అధికారులు
- విచారణలో తవ్వేకొద్దీ బయటకొస్తున్న నిజాలు
- పేరు తప్పుతో మనోజ్‌కుమార్ అతి తెలివి
- హైకోర్టును ఆశ్రయించిన 'మూతల' నిందితుడు



శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్న ఏడుగురిలో ఐదుగురు నిందితులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : నకిలీ మద్యం తయారీ కేసులో ఒక్కొక్కరి వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రధాన నిందితులు అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహనరావును వారం పాటు కస్టడీకి తీసుకుని విచారణ చేశారు. వారిద్దరూ ఇచ్చిన సమాచారంతో వైసీపీ నేత, మాజీమంత్రి జోగి బ్రదర్స్‌కు సంకెళ్లు వేశారు. నకిలీ మద్యం తయారీలో ఎవరెవరి పాత్ర ఎంత అన్న దానిపై ఒక్కో నిందితుడిని విచారణ చేయడం ద్వారా కూపీ లాగుతున్నారు. తాజాగా రిమాండ్ ఖైదీలుగా ఉన్న బాదల్‌దాస్, ప్రదీప్‌దాస్, డి.శ్రీనివాస్‌రెడ్డి, వెంకట కల్యాణ్, అల్లాభక్షు, నకరికంటి రవి, తాండ్ర రమేశ్‌బాబును శుక్రవారం కోర్టు ఐదు రోజుల కస్టడీకి ఇచ్చింది.

ఒక్కొక్కరుగా విచారణ

బాదల్‌దాస్, ప్రదీప్‌దాస్ ఇబ్రహీంపట్నంలో ఉన్న ఏఎన్‌ఆర్ బార్‌లో పనిచేస్తూనే నకిలీ మద్యం సీసాలను బాక్స్‌లో పెట్టేవారు. ఫార్ములాను ఉపయోగించిన బాలాజీ చెప్పినట్టుగా వారు చేసేవారు. ఈ మద్యాన్ని బార్ బిజీగా ఉన్న రోజుల్లో మందుబాబులకు సరఫరా చేసేవారు. గన్నవరం మండలం సూరంపల్లిలో ప్లాస్టిక్ వస్తువుల తయారీ పరిశ్రమ నిర్వహించే డి.శ్రీనివాసరెడ్డి అద్దేపల్లి సోదరులకు అడిగిన మొత్తంలో ప్లాస్టిక్ సీసాలను సరఫరా చేశాడు. వాటికి అవసరమైన మూతలను వన్‌టౌన్‌లోని మనోజ్‌కుమార్ జైన్ బ్రాండ్లను ముద్రించి సరఫరా చేసేవాడు. హైదరాబాద్‌కు అల్లాభక్షు, జగ్గయ్యపేటకు చెందిన నకరికంటి రవి, ఒంగోలుకు చెందిన తాండ్ర రమేశ్‌బాబు.. అద్దేపల్లి సోదరులు చెప్పినట్టుగా సరుకును తలో ప్రదేశానికి మార్చేవారు. వారిద్దరి ఆదేశాల ప్రకారం అడుగులు వేసేవారు. ఇప్పుడు ఈ నిందితులను ఎక్సైజ్, సిట్ అధికారులు ఒక్కొక్కరుగా విచారణ చేస్తున్నారు. వారి వాంగ్మూలాన్ని నమోదు చేస్తున్నారు.

మనోజ్ అతితెలివి

నకిలీ మద్యం తయారీ కేసులో ఏ20గా ఉన్న మనోజ్‌కుమార్ జైన్ అతి తెలివి ప్రదర్శిస్తున్నాడు. ఎక్సైజ్ అధికారులు చేసిన తప్పిదాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంటున్నాడు. దీనిపై న్యాయపోరాటం చేయడానికి హైకోర్టు మెట్లెక్కాడు. మాజీమంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు రామును సిట్ అధికారులు ఈనెల రెండో తేదీన అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆరోజున కోర్టుకు సమర్పించిన కేసు డైరీలో ఏ20గా మనోజ్ కొఠారి పేరును రాశారు. మూడో తేదీన వన్‌టౌన్‌లోని పులిపాటి వారి వీధిలో ప్లాస్టిక్ మూతల వ్యాపారం చేస్తున్న మనోజ్‌కుమార్ జైన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనికి చాతీనొప్పి రావడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి 41ఏ నోటీసు ఇచ్చి మిగతా 6లో..



- టెలి కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్, టెక్నికల్ విభాగాలన్నీ ఇక్కడే
- రూ.80 కోట్లతో పూర్తయిన టవర్, కాంప్లెక్స్ పనులు
- ఇక సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేయటమే ఆలస్యం

ఏటీసీ టవర్ రెడీ

విజయవాడ విమానాశ్రయంలో అత్యాధునికంగా నిర్మాణం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ విమానాశ్రయంలో సరికొత్త ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) టవర్, అనుబంధ కాంప్లెక్స్ పనులు పూర్తయ్యాయి. ఎయిర్‌పోర్టులో శాశ్వత ప్రాతిపదికన నిర్మిస్తున్న నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్‌కు అనుసంధానంగా ఈ టవర్, కాంప్లెక్స్ పనులను రూ.80 కోట్లతో చేపట్టారు. ఈ రెండూ యుద్ధప్రాతిపదికన పూర్తయ్యాయి. ఇంటిగ్రేటెడ్ మిగతా 6లో..

అత్యాధునికంగా...

అంతర్జాతీయ విమానాశ్రయాలకు అనుగుణంగా ఈ ఏటీసీ టవర్ అత్యాధునికంగా రూపుదిద్దుకుంది. పొడవు 25 మీటర్లు. విమానాల కదలికలను సమర్థవంతంగా నిర్వహించటంతో పాటు విమానాల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇది పనిచేస్తుంది. ఈ టవర్‌లో అధునాతన సాంకేతిక వ్యవస్థలు ఉంటాయి. ఈ వ్యవస్థలు భూమిపైనా, ఆకాశంలో విమానాలతో నిరంతరం కమ్యూనికేషన్‌లో ఉంటాయి. దీనిలో ఇంకా సాంకేతిక వ్యవస్థలను ఏర్పాటు చేయలేదు. ఇప్పుడిప్పుడే పనులు చేపడుతున్నారు. విమమానాశ్రయ నూతన టెర్మినల్ బిల్డింగ్ పూర్తయ్యే నాటికి దీనిని పూర్తి చేస్తారు.

కృష్ణామిల్క్ వృద్ధికి మండవ సేవలు ఎనలేనివి
- యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు 6

చరిత్రహీనుడు వైసీపీ నేత జోగి రమేశ్
- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు 8

60 ఏళ్ల సొరంగం
- విజయవాడలోని సొరంగానికి ఘన చరిత్ర





బ్రాహ్మణవీధి జమ్మిదొడ్డిలో దుర్గగుడి పాలకమండలి సమావేశం

దుర్గమ్మ భక్తులకు ఉదయం అల్పాహారం

- భవానీదీక్షల విరమణల ఏర్పాట్లకు ఆమోదం
- అన్నవితరణలో అదనపు ఆహారపదార్థాలకు నో..
- పాలకమండలి తొలి సమావేశంలో పలు తీర్మానాలు

ఇంద్రకీలాద్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానం బ్రాహ్మణవీధి జమ్మిదొడ్డిలో శుక్రవారం పాలకమండలి నిర్వహించిన తొలి సమావేశంలో పలు తీర్మానాలకు ఆమోదం తెలిపారు. పాలకమండలి అధ్యక్షుడు బొర్రా రాధాకృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈవో వీకే శీనానాయక్, సభ్యులు పాల్గొన్నారు. భవానీదీక్షల విరమణకు సంబంధించి ఏర్పాట్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. మొత్తం 24 అంశాలకుగాను 19 అంశాలకు ఆమోదం తెలిపారు.

● కొండపైన దేవస్థానం సూచించిన ప్రదేశంలో తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేసి కూల్‌డ్రింక్ షాపు నిర్వహించుకునేందుకు అక్టోబరు 16న జరిగిన టెండర్ కమ్ వేలంపాటలో శ్రీరామ ఎంటర్‌ప్రైజెస్ దక్కించుకున్న పాటను భక్తుల భద్రత దృష్ట్యా రద్దు పరుస్తూ తీర్మానించారు.

● అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, రవిక ముక్కలు పోగు చేసుకునేందుకు గుంటూరుకు చెందిన పావని కలెక్షన్స్ అక్టోబరు 10న హెచ్చు పాట పాడి దక్కించుకున్నారు. అయితే సభ్యులందరితో సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని ఈ అంశాన్ని వాయిదా వేశారు.

● సీతానగరంలో వీరాంజనేయ సమేత కోదండరామస్వామికి చెందిన విజయవాడ సూర్యారావుపేటలో గల 400 చదరపు గజాల స్థలాన్ని వినియోగించుకునేందుకు స్కూల్స్ కాలేజీలు, హాస్పటల్స్ తదితరాలకు తాత్కాలిక నిర్మాణాల ద్వారా 11 సంవత్సరాల పాటు లీజుకు ఇచ్చేందుకు చేసిన ప్రతిపాదనను వాయిదా వేశారు. గూడవల్లిలో ఉన్న 7.66 ఎకరాల భూమి లీజువిషయం సభ్యుల పరిశీలన నిమిత్తం వాయిదా వేశారు. అన్నదాన ట్రస్ట్ విభాగంలో భక్తులు అదనంగా అడిగిన ఆహారపదార్థాలను పెంచే అంశాన్ని పాలకమండలి తిరస్కరించింది. ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలని తీర్మానించింది.

● తెల్లవారుజామున ఆలయానికి వచ్చే భక్తులకు బొంబాయిరవ్వ లేదా గోధుమరవ్వ, దద్దోజనం, కట్టుపొంగలిని అల్పాహారంగా ఇచ్చేందుకు ఆమోదించారు. సాధారణ రోజుల్లో 1500 మందికి, వారాంతపు సెలవులు, పర్వదినాల రోజుల్లో 2000 మందికి చొప్పున అందించేందుకు నిర్ణయించారు. భక్తుల రద్దీ, రోజుల ప్రాముఖ్యతను బట్టి పదార్థాలను పెంచుకునేందుకు, తగ్గించుకునేందుకు కూడా ఆమోదించారు.

భవానీదీక్షల విరమణ ఏర్పాట్ల ప్రతిపాదనలకు ఆమోదం

డిసెంబరు 11 నుంచి 17 వరకు భవానీ దీక్షల విరమణ సందర్భంగా రైల్వేస్టేషన్, బస్టాండ్ నుంచి భక్తులను తరలించేందుకు ట్రాన్స్‌పోర్టు, నాన్‌ట్రాన్స్‌పోర్టు వాహనాలకు అయ్యే రూ.9.60లక్షల ఖర్చు అంచనాలను ఆమోదించారు. 10 లక్షల వాటర్ బాటిల్స్ 7 లక్షల వాటర్ ప్యాకెట్లు మునిసిపల్ కార్పొరేషన్ ద్వారా అందించేందుకు ఆమోదించారు. ప్రధాన ఆలయం, శివాలయం నుంచి టోల్‌గేట్ వరకు విద్యుత్ దీప అలంకరణల కోసం రూ.38 లక్షల అంచనాలతో పాటు పలు అంశాలకు ఆమోదం తెలిపారు.



దుర్గమ్మ దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి పై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ఆర్జిత సేవల్లో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం శీఘ్రతరంగా జరిగేందుకు ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్, సిబ్బంది క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని తాగునీరు, ఉచిత ప్రసాదం, అన్నప్రసాదం సత్వరం అందేలా దేవస్థానం అధికారులు తగు చర్యలు తీసుకున్నారు.



మండవ జానకిరామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న చలసాని ఆంజనేయులు, అధికారులు

కృష్ణామిల్క్ వృద్ధికి మండవ సేవలు ఎనలేనివి

- యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

చిట్టినగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : కృష్ణామిల్క్ యూనియన్ అభివృద్ధికి మాజీ చైర్మన్ మండవ జానకిరామయ్య చేసిన కృషి ఎనలేనిదని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు కొనియాడారు. శుక్రవారం చిట్టినగర్ పాలఫ్యాక్టరీలో మండవ జానకిరామయ్య సంతాప కార్యక్రమం నిర్వహించారు. తొలుత యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబులు మండవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు అధికారులు సిబ్బంది సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ పాడి పరిశ్రమ అభివృద్ధికి మండవ జానకిరామయ్య కృషి ఎనలేనిదన్నారు. పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి రాష్ట్ర స్కూల్ గేమ్స్ ప్రారంభం

విజయవాడ(స్పోర్ట్స్), నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : పటమటలోని కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8నుంచి 10వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు వీవీఎన్ సత్యనారాయణ తెలిపారు. అండర్-17 హ్యాండ్ బాల్ బాలికల విభాగంలో, నెట్‌బాల్ అండర్-17 బాల బాలికల విభాగంలో పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. పోటీలకు రాష్ట్రంలోని 13జిల్లాల నుంచి 500మందికి పైగా క్రీడాకారులు హాజరుకానున్నారని, తెలిపారు. పోటిలకు కార్యనిర్వాహక కారదర్శిగా ఎల్.దుర్గారావు, అడ్మిన్ కార్యదర్శిగా టి.శ్రీలతలు వ్యవహరిస్తారని, పోటిల్లో ప్రతిభ కనబరిచిన వారు జాతీయస్థాయి పోటిల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అనంతరం క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు.



ఆఫ్రికన్ నత్తలతో ఆందోళన వద్దు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

- సీఎంవో ఆదేశాలతో హుటాహుటిన కదిలిన యంత్రాంగం
- జి.కొండూరులో పంటలను పరిశీలించిన ఉద్యాన శాఖ అధికారులు



జి.కొండూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రైతులను హడలెత్తిస్తున్న ఆఫ్రికన్ నత్తల నివారణ చర్యలకు ప్రభుత్వ యంత్రాంగం ఉపక్రమించింది. రైతులకు నిద్రలేకుండా చేస్తున్న ఆఫ్రికన్ నత్తలు కేరళ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించినట్టు నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం కీటక శాస్త్రవేత్త సెల్వరాజ్ స్పష్టం చేశారు. పంటలను పీల్చి పిప్పి చేస్తున్న నత్తలతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో.. సీఎంవో ఆదేశాల మేరకు శుక్రవారం ఉద్యానశాఖ అధికారులు హుటాహుటిన గ్రామాల్లో పర్యటించారు. నత్తలపై రైతుల అనుమానాలను నివృతి చేశారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలంలో పలు గ్రామాల్లో నత్తలు ఆశించిన పంటలను శుక్రవారం ఉద్యానశాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు. ఆఫ్రికా నత్తలతో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వాటిని చాలా సులువుగా నివారించుకోవచ్చని జిల్లా ఉద్యానశాఖాధికారి బాలాజీకుమార్, నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సెల్వరాజ్‌లు పేర్కొన్నారు. ఈనెల 5న 'హడలెత్తిస్తున్న ఆఫ్రికన్ నత్తలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం జి.కొండూరులోని బొప్పాయి, పామాయిల్, వంగ తదితర పంటల్లో



పామాయిల్ మొక్కల్లో నత్తలను పరిశీలిస్తున్న అధికారులు



ఆఫ్రికన్ నత్తలను గుర్తించారు. మునగపాడు బైపాస్ రోడ్డులో మండవ దుర్గారాణి తన పామాయిల్ తోటలో నత్తలను నిర్మూలించిన విధానం బాగుందని చెప్పారు. అనంతరం వారు మాట్లాడుతూ, పంటలపై 10 శాతానికి మించి నత్తల దాడి లేదని తమ పరిశీలనలో గుర్తించామని చెప్పారు. సకాలంలో అధికారులు సూచించే నివారణ పద్ధతులు పాటించి నత్తలను నివారించుకోవచ్చన్నారు.

నివారణ పద్ధతులు

పాడైపోయిన గన్నీబ్యాగ్స్‌ను ఉప్పు ద్రావణంలో ఉంచి పొలానికి రక్షణ గోడలా వేసుకుంటే అవి వ్యాప్తి చెందవు. కాపర్‌సల్ఫేట్ 1.5 గ్రాములు, ఐరన్ సల్ఫేట్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి ప్రతి మూడు రోజుల కొకసారి పిచికారీ చేసుకుంటే నత్తల ఉధృతి, ఉనికిని తగ్గించుకోవచ్చు. ఎక్కువగా ఉధృతి ఉంటే ఎకరానికి 3 నుంచి 4 కేజీల మెటాల్డిహైడ్ బలపాలు అక్కడక్కడ పెట్టి నివారించుకోవచ్చు. 25 కిలోల వరి తవుడు, బెల్లం 3 కిలోలు, 100 థయోడిన్ పొడి మందు, 100 గ్రాముల ఆముదంతో విషపు గిళికలు తయారు చేసుకొని పొలంలో అక్కడక్కడ వేసుకోవాలి. ముఖ్యంగా పొలంలో, గడ్ల మీద కలుపు ఎక్కువగా లేకుండా చూసుకోవాలి. చెత్త కుప్పలు ఉండకూడదు. అత్యధిక వర్షపాతం వల్ల తేమశాతం అధికమై నత్తల ఉధృతి అధికమయ్యింది. జూలై నుంచి ఫిబ్రవరి వరకు నత్తలకు అనుకూల సమయం కనుక ఈ సమయంలో రైతులు పొలాలను శుభ్రంగా ఉంచుకోవాలి.



కేరళ రాష్ట్రం నుంచి వచ్చాయి..

- సెల్వరాజ్, కీటక శాస్త్రవేత్త



కేరళ రాష్ట్రం నుంచి ఈరకం నత్తలు రాష్ట్రానికి వచ్చాయి. మూడు నాలుగు మాసాల క్రితం వీటిని పార్వతి మన్యం, విశాఖ జిల్లాలో గుర్తించాం. కేరళ రాష్ట్రం నుంచి ఆయిల్ పామ్‌లో తమలపాకు సాగుకు నర్సరీ నుంచి మొక్కలు తీసుకువచ్చారు. వాటిద్వారా వచ్చాయి. అన్ని రకాల కూరగాయలు, పండ్ల తోటలను నాశనం చేస్తాయి. వీటి గురించి ఆందోళన చెందవద్దు.

గోదావరి జిల్లాలతో పోల్చితే ఉధృతి తక్కువే

- జిల్లా ఉద్యానఅధికారి బాలాజీకుమార్



గోదావరి జిల్లాలతో పోల్చితే ఈప్రాంతంలో నత్తల ఉధృతి చాలా తక్కువ. నత్తల బెడద తొలి దశలోనే ఉంది. జి.కొండూరు మండలంలో 2 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. అధిక వర్షాలవల్ల నత్తలు వ్యాప్తి చెంది రాత్రి పూట పంటలకు ఎక్కువ నష్టం చేస్తుంటాయి. చిన్న మొక్కలు చనిపోతాయి. రైతుల అప్రమత్తతతో చాలా వరకు నివారించుకోగలిగారు. విధిగా నివారణ పద్ధతులతో పాటు చేతికి గ్లౌజులు వేసుకోవాలి. లేదా నత్తలు విసర్జించే జిగురులాంటి ద్రావణం వల్ల చర్మ వ్యాధులతో పాటు దద్దుర్లు వచ్చే అవకాశం ఉంది.

వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

- మంత్రి సత్యకుమార్ యాదవ్
- ఘనంగా వందేమాతరం వేడుకలు

వన్‌టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాది భారతీయుల్లో వందేమాతరం గేయం స్ఫూర్తి నింపిందని, విద్వాంసుల నుంచి విప్లవకారుల వరకు ఈ గేయం కదిలించిందని, వందేమాతరం స్ఫూర్తితో వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా అధికార యంత్రాంగం, కేబీఎన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కేబీఎన్ కళాశాలలో ప్రత్యేక వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరి, రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, కలెక్టర్ జి.లక్ష్మీశ, ఆర్డీవో కావూరి చైతన్య, తదితరులతో కలిసి భరత మాత చిత్రపటానికి పూలమాలలు అలంకరించారు. అదేవిధంగా వందేమాతరం రచయిత బంకించంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుమారు మూడువేల మంది విద్యార్థులతో వందేమాతరం గేయాలాపన చేశారు. ప్రధానమంత్రి సందేశాన్ని వర్చువల్‌గా వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమంలో



భరతమాత, బంకించంద్ర చటర్జీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ లక్ష్మీశ, తేజస్వి పొడపాటి

పాల్గొని ఎందరో ప్రాణాలు త్యాగం చేశారని.. ఈ సందర్భంగా ఆ మహనీయులకు ఘన నివాళులు అర్పిస్తున్నట్టు పేర్కొన్నారు. వందేమాతరం గేయం స్వాతంత్ర్య ఉద్యమానికి వేదికగా నిలిచిందని, ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపిందన్నారు. వందేమాతరం ఔన్నత్యాన్ని దేశభక్తిని, జాతీయతా భావనను పెంపొందించుకొని యువత ముందడుగు వేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే సుజనాచౌదరి మాట్లాడుతూ, కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు కులాలు, మతాలకు అతీతంగా దేశ ప్రజల్లో వందేమాతరం స్ఫూర్తి నింపిందన్నారు. తేజస్వి పొడపాటి మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమానికి వందేమాతరం శ్వాసగా ప్రతిఒక్కరి హృదయాల్లో నిలిచిందని పేర్కొన్నారు. ప్రధాని మార్గనిర్దేశనంతో ఏడాది పాటు ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయని వివరించారు. గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ, కళా వైభవంతో వందేమాతరం విశిష్టతను వ్యాప్తి చేసేందుకు అకాడమీ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్.మల్లికార్జున రావు, కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, వందేమాతరం దేశ ప్రజల్లో అచంచలమైన దేశభక్తిని పెంపొందించిందని, ఈ గేయం 150 ఏళ్ల వేడుకల్లో భాగంగా ఏడాదిపాటు ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



కేబీఎన్ కళాశాలలో వందేమాతరం వేడుకలో పాల్గొన్న విద్యార్థులు



కంచికచర్ల యార్డులో పెసలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

పెసలనూ కొనుగోలు చేస్తాం..

- సీసీఐ కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే సౌమ్య

కంచికచర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెసలు కొనుగోళ్లకు సంబంధించి శాయశక్తులా కృషి చేస్తున్నట్టు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. శుక్రవారం కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆమె, సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు పెసర రైతులు ఎమ్మెల్యేకు తమ గోడును విన్నవించారు. పెసలు ఇంటికి వచ్చి రెండు నెలలు గడిచిందని, ఎక్కువ రోజులు నిల్వ చేయటం వల్ల నాణ్యత దెబ్బతినే ప్రమాదం నెలకొందని వాపోయారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, పెసలు కొనాల్సిందిగా విన్నవించుకుంటున్నప్పటికీ అధికారుల్లో చలనం లేదన్నారు. రబీ సీజన్ పనులు ప్రారంభం కావటంతో చేతిలో సొమ్ములు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎమ్మెల్యే సౌమ్య జిల్లా అధికారులతో మాట్లాడి పెసలు కొనుగోలు చేయాల్సిందిగా కోరారు. అధైర్యపడవద్దని, పెసలు కొనేలా కృషి చేస్తానంటూ రైతులకు హామీఇచ్చారు. స్థానిక యార్డులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇప్పటికే రైతులు భారీ వర్షాలు, మొంథా తుఫాన్ వల్ల దెబ్బతిన్నారని, తేమ విషయంలో నిబంధనలు సడలించి, రైతులను ఆదుకోవాల్సిందిగా సీసీఐ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోగంటి బాబు, పాలకవర్గసభ్యులు, ఏడీఎం రాజాబాబు, కార్యదర్శి శ్రీనివాస్, సీసీఐ బయ్యర్ బాల నరసింహ నాయక్ పాల్గొన్నారు.

ఒక్కొక్కరుగా నకిలీలు

(5వ పేజీ తరువాయి)

విడుదల చేశారు. నేరాలు చేయడంలో అనుభవం ఉన్న మనోజ్‌కుమార్ ఇక్కడే తన మెదడుకు పదును పెట్టాడు. ఎఫ్ఐఆర్, కేసు డైరీలో తన పేరు లేకపోయినా ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని కోర్టును ఆశ్రయించాడు. వ్యాపారరీత్యా తనకు వచ్చిన ఆర్డర్ల ప్రకారమే మూతలు సరఫరా చేశానని చెబుతున్నాడు. ఆ మూతలపై నకిలీ మద్యం బ్రాండ్ల పేర్లను ముద్రించి మరీ సరఫరా చేయడాన్ని ఎక్సైజ్ పోలీసులకు ఒక ఆధారంగా మారింది. తాను మూతలను మనోజ్‌కుమార్ నుంచి కొన్నానని అద్దేపల్లి జనార్దనరావు స్పష్టంగా చెప్పాడు. అసలు జనార్దనరావు అనే వ్యక్తి ఎవరో తనకు తెలియదని, కలిసి వ్యాపారం చేయలేదని మనోజ్ చెబుతున్నాడు. ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండా అరెస్టు చేయడానికి ఎక్సైజ్ పోలీసులు ప్రయత్నిస్తున్నారని హైకోర్టును ఆశ్రయించాడు. ఎక్సైజ్ పోలీసులు సీడీ ఫైలులో మనోజ్ కొఠారి అని మాత్రమే రాశారు. విజయవాడ వన్‌టౌన్‌లో అనేక మంది ఈ పేరుతో ఉన్నారని, వారెవరో స్పష్టంగా రాయాలని వైసీపీలో కీలకంగా వ్యవహరిస్తున్న మనోజ్ కొఠారి చెబుతున్నాడు. ఎక్సైజ్ పోలీసులు ఈ పేరును ప్రస్తావించగానే అంతా వైసీపీ నేత మనోజ్ కొఠారిని నిందితుడిగా చేర్చారని భావించారు. తర్వాత అదే పోలీసులు మనోజ్‌కుమార్ జైన్‌ను అరెస్టు చేయడంతో గందరగోళం ఏర్పడింది. సీడీ ఫైలులో పేరు తేడాగా ఉండటంతో జనార్దనరావుకు ముద్రించిన ప్లాస్టిక్ మూతలను సరఫరా చేసిన మనోజ్‌కుమార్ జైన్ తెలివితేటలను ప్రదర్శిస్తున్నాడు.

సీఎం సూచనల మేరకు దుర్గగుడి అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

విజయవంతం చేస్తామన్నారు. ఇంజనీరింగ్ పనులకు ఇప్పటికే టెండర్లు పిలిచామని చెప్పారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కనకదుర్గానగర్, ఘాట్‌రోడ్డులోని దుకాణాలన్నింటినీ మహామండపం ఐదో అంతస్థులోకి మార్చనున్నట్లు చెప్పారు. షాపుల వద్ద ప్రతి వ్యాపారీ తప్పనిసరిగా ధరల పట్టిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక పూజా సామగ్రి విక్రయాల దుకాణాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దేవస్థానం నుంచి పోరంకి వరకు ప్రత్యేక బస్సును దాతల సాయంతో కానీ, ఆలయ నిధులతో కానీ నడుపుతామన్నారు. దేవస్థాన అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. మల్లేశ్వరస్వామి ఆలయ గోపురానికి బంగారు తాపడం చేయించనున్నట్లు తెలిపారు. ఈవో శీనానాయక్ మాట్లాడుతూ భవానీ దీక్ష విరమణల ఏర్పాట్లపై చర్చించామన్నారు. కనకదుర్గానగర్‌ను మరింత అభివృద్ధి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. దీక్షల విరమణ అనంతరం మాస్టర్ ప్లాన్‌పై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

బెజవాడ బార్‌లో రాష్ట్రస్థాయి క్యారమ్, చెస్ టోర్నమెంట్

విజయవాడ లీగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్టేట్ బార్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెజవాడ బార్ అసోసియేషన్ ఆవరణలో శని, ఆదివారాలు రెండు రోజుల పాటు రాష్ట్రస్థాయి న్యాయవాదుల క్యారమ్, చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్టు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్‌లకు చెందిన న్యాయవాదులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్‌రాయ్ విచ్చేయనున్నట్టు, బహుమతి ప్రదాన కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య హాజరవుతున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుట్టల గోపి, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానందం, బార్ కౌన్సిల్ మెంబర్లు సుంకర రాజేంద్రప్రసాద్, సూరా బత్తుల మల్లేశ్వరరావు, చలసాని అజయ్‌కుమర్, ఏపీ హైకోర్టు బార్ అధ్యక్షులు కె.చిదంబరం హాజరవనున్నట్టు బాషా తెలిపారు.

కష్టపరిహారం

(5వ పేజీ తరువాయి)

గింజలు పాలుపోసుకోని పంటను నష్టపరిహారం జాబితాల్లో నమోదు చేయాలని రైతులు కోరుతున్నారు. అయితే, తమకిచ్చిన నిబంధనల మేరకే నష్టపరిహారం జాబితాలను తయారు చేస్తామని మండలస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు చెబుతుండటంతో, తుది జాబితాలు తయారయ్యే నాటికి ఎంతమందికి పరిహారం అందుతుందనే అంశంపై సందిగ్ధం నెలకొంది.

జాబితాల తయారీ ఎప్పటికో..?

జిల్లాలో 2,229 మంది రైతులు సాగు చేస్తున్న 1,416.22 హెక్టార్లలోని ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్టుగా అధికారులు నివేదిక తయారు చేశారు. వీటికి సంబంధించి రూ.73.45 కోట్ల మేర నష్టం జరిగినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించారు. ఉద్యాన శాఖలో సిబ్బంది లేకపోవడంతో రైతుసేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులే ఈ జాబితాలను తయారు చేయాల్సి ఉంది. జాబితాలను తయారు చేస్తున్నామని, ఈ నివేదికలు పూర్తయ్యాక గ్రామసభలు నిర్వహిస్తామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. సామాజిక త నిఖీల్లో భాగంగా రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, వాటిని సరిచేసిన అనంతరం కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నష్టం జాబితాలను పంపుతామని పేర్కొంటున్నారు. అయితే, ఈ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందనే అంశంపై స్పష్టత లేదు. తుది నివేదికలు తయారయ్యాక ఒక కుటుంబం లేదా ఒక రైతుకు ఐదు ఎకరాల వరకు ఉంటే పంట నష్టపరిహారం పరిమితి నిబంధనలు వర్తిస్తాయని, ఈ జాబితాలు ఆర్టీజీఎస్‌లో పరిశీలించాకే జిల్లాలో ఎంతమంది రైతులకు, ఎంతమేర పంట నష్టపరిహారం విడుదల అవుతుందనే అంశంపై స్పష్టత వస్తుందని వారు స్పష్టం చేస్తున్నారు.

ఏటీసీ టవర్ రెడీ

(5వ పేజీ తరువాయి)

టెర్మినల్ బిల్డింగ్ కూడా పూర్తయ్యాక వినియోగంలోకి తీసుకొస్తారు.

వేగవంతమైన వ్యవస్థలు

ఈ ఏటీసీ టవర్‌లో రాడార్ వ్యవస్థలు ఉంటాయి. రేడియో తరంగాలను ఉపయోగించి విమానం ఎక్కడ ఉంది, కచ్చితమైన స్థానం, వేగం, ఎత్తును ఇవి నిర్ణయిస్తాయి. ఆటోమేటిక్ డిపెండెంట్ సర్వైలెన్స్-బ్రాడ్‌కాస్ట్ (ఏడీఎస్-బీ) మరో ప్రధానమైన వ్యవస్థ. ఈ వ్యవస్థ ద్వారా విమానం ఎక్కడ ఉందన్న విషయాన్ని ఉపగ్రహాల ద్వారా ప్రసారం చేస్తుంది. టవర్ దానిని గ్రహిస్తుంది. ఫ్లైట్ డేటా ప్రాసెసింగ్ సిస్టమ్స్ (ఎఫ్‌డీపీఎస్) అనేది ఇంకో ముఖ్యమైన వ్యవస్థ. ఈ వ్యవస్థ ద్వారా విమాన మార్గం, చేరుకునే సమయాన్ని అంచనా వేయడం, వాతావరణం వంటి సమాచారాలను టవర్‌కు అందిస్తుంది. సర్ఫేస్ మూవ్‌మెంట్ రాడార్.. అనేది విమానం రన్‌వేపై ఉన్నపుడు ఇతర వాహనాల కదలికలను గుర్తిస్తుంది. దీంతో పాటు విమాన పైలెట్లతో నిరంతరం కమ్యూనికేషన్స్ చేసే వ్యవస్థ, రియల్‌టైమ్ వెదర్, రాడార్, శాటిలైట్ డేటాను అందించే వ్యవస్థలు ఉంటాయి. ఇవన్నీ ఏర్పాటు కావటానికి రెండు నెలలు పట్టే అవకాశం ఉంది. టవర్ వెనుక ఉన్న కాంప్లెక్స్‌లో ఎలక్ట్రికల్, టెలి కమ్యూనికేషన్ విభాగాలు ఏర్పాటు చేస్తారు.



రోడ్డుపై బోల్తా పడిన కూరగాయల లారీ

కూరగాయల వ్యాన్ బోల్తా

- వాహనాల రాకపోకలు లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం

జగ్గయ్యపేట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా వై జంక్షన్ వద్ద మినీలారీ బారికేడ్లను ఢీకొట్టి బోల్తా కొట్టింది. ఎటువంటి ప్రాణనష్టం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జాతీయ రహదారి(ఎన్‌హెచ్-65)పై శుక్రవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. విజ



యవాడ వైపు నుంచి కూరగాయల లోడుతో హైదరాబాద్ వైపు అతివేగంగా వస్తున్న మినీలారీ షేర్ మహ్మదపేట, ఆటోనగర్ వైజంక్షన్ దగ్గర రహదారిపై బారికేడ్లను ఢీకొనటంతో అదుపు తప్పింది. ఆ సమయంలో అటుగా వాహనాల రాకపోకలు లేకపోవటంతో పెద్ద ప్రమాదమే తప్పింది. వ్యాను బోల్తా పడటంతో కూరగాయలన్నీ హైవేపై చిందర వందరగా పడ్డాయి. హైవే మొబైల్ పోలీసులు అక్కడకు చేరుకుని రోడ్డుకు అడ్డంగా పడిన లారీని క్రేన్‌తో తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఘటనలో డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్పగాయాలయ్యాయి.

ఆలయ స్థలం ఆక్రమణ

(5వ పేజీ తరువాయి)

చేశారు. ఇందులో స్థలం సరిహద్దులను స్పష్టంగా పేర్కొన్నారు. కృష్ణమూర్తి మరణానంతరం ఎవరూ ఆ స్థలాన్ని కొలిచి ఆలయానికి అప్పగించలేదు. ఆ తర్వాత దేవదాయ శాఖ అధికారులు, ధర్మకర్తలు మారుతూ వచ్చారు. కాలక్రమేణా రికార్డుల్లో ఆ స్థలం ఉన్నట్లు చూపించిన దాఖలాలు కూడా లేవు. ప్రస్తుతం ఈ స్థలంలోని పెంకుటిల్లు శిథిలావస్థకు చేరింది. రెండువైపులా రహదారి ఉండటంలో స్థలం విలువ ఒక్కసారిగా పెరిగింది.

ప్రజారోగ్యానికి, భద్రతకు ప్రభుత్వ ప్రాధాన్యం

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

విజయవాడ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి, భద్రతకు ప్రభుత్వ ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామానికి చెందిన పైలా రాముకు రూ. 1.50 లక్ష సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గన్నవరంలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అంబాపురం అధ్యక్షుడు చల్లగాలి సునీల్ పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పక్కన సునీల్

మచ్చలేని మహామనిషి జానకి రామయ్య

గన్నవరం: మచ్చలేని మహామనిషి మండవ జానకి రామయ్య అని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. నీతి నిజాయితీతో విజయడెయిరీకి సేవలందించి సంస్థను అభివృద్ధి పథంలోకి నడిపించారన్నారు. శుక్రవారం మండలంలోని చిన అవుటపల్లి రుషివాటికలో విజయ డెయిరీ మాజీ చైర్మన్ మండవ జానకి రామయ్య నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గూడపాటి తులసీమోహన్, గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, చిమట రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఇంటిపన్ను చెల్లించవచ్చు

గన్నవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులు పంచాయతీ కార్యాలయానికి వచ్చి చెల్లించే పని లేకుండా ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. మండలంలోని కేసరపల్లి శివారు వివిఎస్‌పురం కాలనీలో ఆన్‌లైన్ ఇంటి పన్ను చెల్లింపు గురించి శుక్రవారం ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల సౌలభ్యం కోసం ఆన్‌లైన్ విధానం వచ్చిందని చెప్పారు.

IN THE COURT OF THE HON'BLE X ADDL. JUDICIAL MAGISTRATE PUBLICATION REQUIRING APPEARANCE OF ACCUSED OF FIRST CLASS AT VUYYURU

C.C.No.74/2018

Between:
Khambhampati Omkareswara Krishna Karthik S/o.Sambasiva Rao, aged about 36 years, RMP Doctor, R/o. Kanumuru village, Pamarru Mandal, Krishia Dist.,

And

Bolisetty Padma, W/o. Late Venkata Rama Subrahmanya Prasad, aged about 50 years, House wife, Resident of Katuru village, Vuyyuru Mandal, Krishna Distric
Complainant .. Accused.

To
Bolisetty Padma, W/o. Late Venkata Rama Subrahmanya Prasad, aged about 50 years, House wife, Resident of Katuru village, Vuyyuru Mandal, Krishna District.

Whereas complainant has been made byone Khambhampati Omkareswara Krishna Karthik, S/o.Sambasiva Rao, aged about 36 years, RMP doctor, R/o. Kanumuru village, Pamarru Mandal, Krishna Dist., against Bolisetty Padma, W/o. Late Venkata Rama Subrahmanya Prasad, aged about 50 years, House wife, Resident of Katuru village, Vuyyuru Mandal, Krishna Dis-trict, before X Addl. Judicial Magistrate of First Class Court, Vuyyuru, Krishna District for the offence punishable under Sec. 138 R/w.142 of Negotiable Instruments Act. It has been returned to a warrant of arrest there upon issued that the said Bolisetty Padma, W/o. Late Venkata Rama Subrahmanya Prasad, cannot be found, and whereas it has been shown to the satisfaction of the Honourable Court that the said Bolisetty Padma, W/o. Late Venkata Rama Subrahmanya Prasad, as absconded (or is concealing herself to avoid the service if the said Warrant). Thereafter you are hereby informed that you - Bolisetty Padma, W/o. Late Venkata Rama Subrahmanya Prasad, aged about 50 years, House wife, Resident of Katuru village, Vuyyuru Mandal, Krishna District is hereby request to appear before the Hon'ble X Addl. Judicial Magistrate of First Class Court at Vuyyuru, Vuyyuru Town and Vuyyuru Mandal, Krishna District either in person or through advocate, to answer the said complaint on 27-11-2025 to which date the above case was posted for your appearance. or else it will be followed further in the above case.

Vuyyuru
Dt.07-11-2025

KAGITHA GOPI CHANDU, ADVOCATE
VUYYURU-521 165,
Cell No.9849286239

ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

ఎమ్మెల్యే బోడె ప్రసాద్


సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారించేందుకే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక ప్రజా సమస్యల పరిష్కారవేదికను ప్రారంభించిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శుక్రవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అధికారులతో కలిసి నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చిన ప్రజల సమస్యలను విని అప్పటికప్పుడే పరిష్కారాలను చూపే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని, గ్రామ వార్డు సచివాలయాలను ప్రక్షాళన చేసి ప్రజల సమస్యలను చాలా సులభంగా పరిష్కరించేట్లు ఏర్పాట్లు చేశామని, అయినా ప్రజలకు సమస్యలు ఏదో ఒకటి వస్తూనే ఉంటాయని గ్రహించి ప్రతి శుక్రవారం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు, టీడీపీ కూటమి నేతలు పాల్గొన్నారు.

● ముఖ్యమంత్రి సహాయనిధి పథకం బడుగులకు, పేద కుటుంబాలకు సంజీవని లాంటిదని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శుక్రవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో వివిధ అనారోగ్యాలతో బాధ పడుతున్న 11మందికి షుమారు నాలుగున్నర లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీలను ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు కోయ ఆనంద్‌ప్రసాద్, అంగిరేకుల మురళి, కొమ్మినేని వెంకటేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.


మారేడుమాకలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

రూ. 70 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు

కంకిపాడు: మండలంలోని మారేడుమాక గ్రామాభివృద్ధికి రూ. 70 లక్షలు ఖర్చు పెట్టినట్లు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మారేడు మాకలో శుక్రవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, మారేడుమాక గ్రామస్తులు తనను ఎప్పుడూ ఆదరించలేదన్నారు. ఇప్పటి వరకు తాను పోటీ చేసిన మూడు పర్యాయాలు తనకు తక్కువ ఓట్లు వేశారన్నారు. అయినా ఎన్నికల వరకే రాజకీయాలు అని ఎన్నికల తరువాత అభివృద్ధి ముఖ్య అజెండా అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ శ్రీనివాసరావు, ఎంపీపీ నెరు సురాజ్యలక్ష్మీ, ఎంపీడీవో అనూష, ఏఈ రాజేష్, సర్పంచ్ ఆదర్శ్, తెన్నేరు డీసీ యార్లగడ్డ రాజా, గద్దె నాగేశ్వరరావు, వీర బాబు, సెక్రటరి బాలకోటి, స్థానిక టీడీపీ నాయకులు మురళి, రామయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసీ పూజ



ఉయ్యూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గండిగుంటలో గణపతి సచిదానంద జ్ఞానబోధ సభ దత్తాశ్రమంలో కార్తీక బహుళ విధియ, అనగా సమేత దత్త దిగంబర అవతార జయంతి పురస్కరించుకుని శుక్రవారం లక్షతులసీ పూజ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకం, నవగ్రహ పూజ, గోపూజ, చండీహోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మూడు వేల మందికి అన్నసమారాధన చేశారు. ఆశ్రమ కమిటీ, గండిగుంట, ఉయ్యూరుకు చెందిన భక్తులు పాల్గొని సేవలందించారు.



శాంతి కల్యాణం

విజయవాడ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కుందా వారి కండ్రికలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్ర వారం శాంతి కల్యాణం ఘనంగా జరిగింది. పురోహితులు వెల్లంకి భవాని ప్రసాద్ శిష్యబృందం ఆధ్వర్యంలో మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో తిప్పర్తి అచ్యుత ప్రసాద్, శశిధర్ దంపతులు, ఆలయ నిర్వాహకులు సుతారి నిరంజన్, పావులూరి రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

పదవులు పొందిన టీడీపీ నేతలకు ఘన సన్మానం



పెనమలూరు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పదవులు పొందిన వ్యక్తులను కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం యనమలకుదురులో ఘనంగా సన్మానించారు. దుర్గగుడి పాలకమండలి సభ్యులు వెలగపూడి శంకరబాబు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాంప్రసాద్, మార్కెట్ యార్డు డైరెక్టర్లు బూక్యా బిచాలి, పండుల రజిని, లాకుల వద్ద ఉన్న అమ్మవారి గుడి డైరెక్టర్లు యువరాజు, కొడాలి కనకదుర్గలను టీడీపీ నేత మొక్కపాటి శ్రీనివాస్ నేతృత్వంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధనేకుల షణ్ముఖరావు, లంకా కృష్ణారావు, బూక్య రాజా, జన్ను నాగరాజు, వీరంకి కుటుంబరావు, వీరంకి నంది, ఆరేపల్లి దాసు, బలగం కొండ, మాచిన శివకుమార్, బెజవాడ శివయ్య, వెంకటేష్, పత్తిపాటి వెంకటేష్, తాడిశెట్టి ప్రసాద్, రామారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతకు స్ఫూర్తి వందేమాతరం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతర గీతంతో స్వాతంత్ర్య రణనినాదాన్ని రచించి జాతికి అంకితం చేసిన బకించంద్ర చటోపాధ్యాయ అందించిన దేశభక్తి నేటితరానికి స్ఫూర్తిదాయకమని బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం బాపులపాడు మండల కార్యాలయంలో వందేమాతరం గీతం 150 ఏళ్ల స్మారకోత్సవ వేడుక నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్వాతంత్రోద్యమంలో భారతీయులను ఏకతాటిపై నడిపించడమే కాకుండా ఇప్పటికీ జాతీయ సమైక్యతకు స్ఫూర్తిని రగిలించేది వందేమాతరం గేయమని టీఎన్‌టీయుసీ నాయకుడు బి. పాండురంగారావు అన్నారు. కోడూరుపాడులో వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బకించంద్ర చటర్జీ చిత్రపటానికి శుక్రవారం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ గండి శ్రీను, కరణం రవి, నీటి సంఘ డైరెక్టర్ అర్నేపల్లి వెంకటేశ్వరరావు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.


కడవకొల్లు సచివాలయం వద్ద వందేమాతరం స్మారకోత్సవ వేడుక

ఉయ్యూరు: ఉయ్యూరు, మండల పరిధి గ్రామాల్లో శుక్రవారం గ్రామసచివాలయాలు, కూడళ్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వందేమాతరం గీతం ఆలపించి వందేమాతర ఉద్యమం గురించి తెలియజేశారు. కడవకొల్లులో జరిగిన సమావేశంలో ఎంపీడీవో శేషగిరిరావు, సర్పంచ్ మంగినేని సుధారాణి, ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్‌కుమార్, కుప్పాల అంజిబాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఉంగుటూరు : 33/11 కేవీ ఉంగుటూరు విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 11గంటల వరకు పలుగ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఉంగుటూరు, ఎలుకపాడు, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు, గారపాడు, పొణుకుమాడు, తుట్టగుంట, నాగవరప్పాడు, వెన్నూతల, వెల్దిపాడు, తరిగొప్పల, వేంపాడు తదితర గ్రామాల్లో మూడుగంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

టిడ్కో ఇళ్లు ఇవ్వాలని ధర్నా

ఉయ్యూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు కేటాయించాలని సీపీఎం ఉయ్యూరు పట్టణ కార్యదర్శి బి.రాజేశ్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలసి శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి కమిషనర్ జాస్తి రామారావుకు వినతిపత్రం అందజేశారు. టిడ్కో పోరాట కమిటీ సభ్యులు షరీనబేగం, ఝాన్సీరాణి, హబీమున్నిసా, సీపీఎం కమిటీ సభ్యురాలు బి.కీర్తి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

ఉంగుటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలని, దీనిని మొదటి దశలోనే గుర్తిస్తే సులభంగా అరికట్టవచ్చునని ఇందుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ బి.శిరీష, డాక్టర్ కేవీ.పద్మావతి అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహనా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామంలో క్యాన్సర్ వ్యతిరేక అవగాహనా ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటరాజు, ఇమ్మానియేల్, ఎంపీహెచ్‌ఏ శివరామకృష్ణ, ఎంపీహెచ్‌వీ జయలక్ష్మి పాల్గొన్నారు.



అనంత పద్మనాభస్వామి దేవస్థానం ట్రస్టీ లక్ష్మీభాయికి చిత్రపటం, ప్రసాదాలు అందిస్తున్న ఆలయ ఈవో శ్రీరామవరప్రసాదరావు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో అనంత పద్మనాభస్వామి దేవస్థానం ట్రస్టీ

మోపిదేవి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని కేరళలోని అనంత పద్మనాభ స్వామి దేవస్థానం ట్రస్టీ అశ్వతీ తిరునాళ్ గౌరీ లక్ష్మీభాయి దర్శించుకున్నారు. దేవస్థానానికి వచ్చిన ప్రిన్సెస్ ఆఫ్ ట్రావెన్ కోర్ గౌరీ లక్ష్మీభాయికి దేవస్థానం ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వా గతం పలికారు. ప్రముఖ నిర్మాత, సినీ నటుడు కొల్లా అశోక్ కుమార్‌తో కలిసి గౌరీ లక్ష్మీభాయి ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పండితులు వారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రిన్సెస్ ఆఫ్ ట్రావెన్ కోర్ లక్ష్మీభాయి, కొల్లా అశోక్ కుమార్‌లను దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆలయ మర్యాదలతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

ఎంఈవో మోటూరు గురుకులం సందర్శన

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రజనీ

గుడివాడ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మోటూరు గురుకుల పాఠశాలలో రెండు రోజుల క్రితం శ్లాబు పెచ్చులూడిపడి ఇద్దరు విద్యార్థినులకు గాయాలు కాగా, ఒక విద్యార్థినికి తీవ్రంగా గాయపడింది. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఎంఈవో-1 రజని స్పందించి శుక్రవారం గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. బాత్ రూమ్‌లు, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. భవనాన్ని పరిశీలించి శ్లాబు బాగా పెచ్చులూ డిపడుతున్నట్లు గమనించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపు తామన్నారు. శ్లాబు పెచ్చులూడే ప్రదేశంలో వెంటనే ప్లాస్టింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. కుకింగ్ సిబ్బందిని తగినంత మందిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భోజనం నాణ్యతతో సమయానికి పెడుతున్నారా? లేదా అని ప్రతి విద్యార్థినీ అడిగి తెలుసుకున్నామన్నారు. విద్యార్థులను సొంత పిల్లలుగా ఆప్యాయంగా చూడాలని ఉపాధ్యాయులకు ఎంఈవో రజనీ సూచించారు.



అభిమానులతో సెల్ఫీ దిగుతున్న నిధి అగర్వాల్, ఈషా రెబ్బా

బెజవాడలో నిధి అగర్వాల్, ఈషా రెబ్బా సందడి

గవర్నర్‌పేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సినీ హీరోయిన్లు నిధి అగర్వాల్, ఈషా రెబ్బా శుక్రవారం బెజవాడలో సందడి చేశారు. అప్సర సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మకుటశ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం ప్రారంభోత్సవానికి విచ్చేసిన వారు పెద్దఎత్తున అక్కడకు చేరుకున్న అభిమానులకు అభివాదం తెలిపారు. అభిమానులతో కలిసి సెల్ఫీలు దిగారు. రెబల్ స్టార్ ప్రభాస్‌తో కలిసి నటించిన రాజ్యసభ చిత్రం జనవరిలో ప్రేక్షకుల ముందుకు రానుందని నిధి అగర్వాల్ తెలిపారు. మరో మూడు చిత్రాల్లో నటిస్తున్నానని, అవి కూడా షూటింగ్ దశలో ఉన్నాయని పేర్కొన్నారు.

మహిళల ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ ఇతివృత్తంతో రోషాగ్ని చిత్రం

● దర్శక, నిర్మాత, కథానాయకుడు రాజవీర



విలేకరులతో మాట్లాడుతున్న రాజవీర, సాహితీవేత్త గోళ్ల నారాయణరావు

గాంధీనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాల్సిన అవశ్యకత ఉందనే అంశంతో రోషా గ్ని చిత్రాన్ని రూపొందించినట్టు చిత్ర దర్శక, నిర్మాత, కథానాయకుడు ఫైట్ మాస్టర్ రాజవీర తెలిపారు. గాంధీనగర్‌లోని ఫిలిం చాంబర్ హాల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సృష్టికర్త ఫిలింస్ బ్యానర్‌పై తెరకెక్కించిన రోషాగ్ని చిత్రం ఈనెల 9న శైలజా థియేటర్‌లో ఉదయం 9 గంటకు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ప్రముఖ నటుడు పవన్ కల్యాణ్ స్ఫూర్తితో తాను కూడా ఎటువంటి డూప్ లేకుండా యా క్షన్ సన్నివేశాలు చేయడం జరిగిందన్నారు. ప్రముఖ సాహితీవేత్త గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ విజయవాడ నగరానికి చెందిన రాజవీర గత 40 ఏళ్లుగా కన్నడ చిత్రపరిశ్రమలో పని చేస్తూ ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించారన్నారు. కన్నడలో విడుదలై విజయవంతంగా ప్రదర్శించిన రోషాగ్ని చిత్రాన్ని ఆదరించాలని కోరారు. ఎడిటర్ విజయ్‌కుమార్, చింతకాయల చిట్టిబాబు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు నెఫ్రాలజిస్టు వైద్యసేవలు

● కలెక్టర్ ఆదేశాలతో ఎ.కొండూరు పీహెచ్‌సీలో వైద్యశిబిరం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



కిడ్నీ రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సరిత

ఎ.కొండూరు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్య సహాయం అందంచాలనే లక్ష్యంతో నెఫ్రాలజిస్టు సేవలు విస్తృతం చేసిన్నట్టు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో శుక్రవారం ఎ.కొండూరు పీహెచ్‌సీలో విజయవాడ ప్రభుత్వాసుపత్రి నెఫ్రాలజిస్టు డాక్టర్ సరిత ఆధ్వర్యంలో వైద్య బృందం 46 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సరిత మాట్లాడుతూ ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, హెల్త్ విజిటర్లు గ్రామాల్లో పర్యటించి కిడ్నీ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని కోరారు. మద్యపానం, ధూమపానం, మత్తుపదార్థాలు సేవించడం, తరచూ కాళ్ల వాపులు వచ్చి తగ్గడం, కండరాల నొప్పులు, శరీరంలో నీరు చేరడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలతో బాధపడే వారు వెంటనే వైద్య పరీక్షలు చే యించుకోవాలన్నారు. ఈ పరీక్షలు ప్రభుత్వం అసుపత్రిలో ఉచితంగా నిర్వహిస్తున్న తెలిపారు. ముఖ్యంగా ఎ.కొండూరు, తిరువూరు, రెడ్డిగూడెం మండలాల పరిధిలో ప్రజలు కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. ప్రముఖ ప్రైవేట్ నెట్‌వర్కు ఆసుపత్రులకు చెందిన నెఫ్రాలజిస్టు డాక్టర్ల సహకారంతో వారానికి ఒక రోజు ఎ.కొండూరు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహిస్తునట్టు డాక్టర్ తెలిపారు. ఈ వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు టీడీపీ సీనియర్ నాయకుడు గడ్డి కృష్ణారెడ్డి 100 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. డాక్టర్‌లు దివ్య, స్వాతి ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తెలుసుకుందాం సొరంగం



బెజవాడ నగరం పేరు చెప్పగానే ఎవరికైనా టక్కున గుర్తుకొచ్చేది వనటౌన్‌లోని ఇంద్రకీలాద్రి సొరంగం. చిట్టినగర్ టన్నెల్ ఏర్పడి 60 ఏళ్లు అవుతోంది.

చిట్టినగర్ ప్రాంతం నుంచి 1965కి పూర్వం విద్యాధరపురం, భవానిపురం, గొల్లపూడి ప్రాంతాలకు చేరుకోవాలంటే ఆంజనేయవాగు సెంటర్, కొత్తపేటచౌక్, విన్నకోటవారి చౌక్, సామారంగం చౌక్ నుంచి ప్రకాశం బ్యారేజీ వద్దకు చేరుకుని హైదరాబాద్ రోడ్డు మార్గంలోకి ప్రవేశించి కుమ్మరి పాలెం గట్టు నుంచి తిరిగి రావాల్సి వచ్చేది. వాహనాల్లో రాకపోకలు సాగించే వారు ఈ మా ర్గాన్ని ఎంచుకునేవారు. కాలి నడకన వెళ్లే వాళ్లు విచిత్రంగా చిట్టినగర్, విద్యాధరపురం మధ్య నున్న కొండను ఎక్కి దిగేవారు. ఈ పరిస్థితులను గమనించిన ప్రఖ్యాత ఇంజనీర్ కె.ఎల్.రావు ఈ ప్రాంతం ప్రయాణం సులభతరం చేయాలని ఆలోచించారు. దీనిలో భాగంగానే 1964లో సొరంగం ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. ఇంజనీర్ కె.ఎల్.రావు దూరదృష్టితో ఆలోచించి టన్నెల్‌ను 120 అడుగులు ఏర్పాటు చేయాలని ముందుగా ప్రతిపాదించారు. అప్పటి రాజకీయ అస్థిర పరిస్థితుల దృష్ట్యా అది కేవలం 60 అడుగులకు కుదించబడింది. భవిష్యత్తులో విజయవాడ-హైదరాబాద్ మధ్య రద్దీ ఏర్పడుతుందని, హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలతో విజయవాడలో ట్రాఫిక్ స్తంభిస్తుందని, దీని కోసం రానున్న రోజుల్లో కచ్చితంగా బైపాస్ ఏర్పాటు చేయాల్సిన పరిస్థితులు వస్తాయని, టన్నెల్ వెడల్పు 120 అడుగులు చేస్తే ఇదే బైపాస్‌గా ఉపయోగపడుతుందని ఇంజనీర్ కె.ఎల్.రావు పంపిన నివేదికను అప్పటి ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. కేవలం 60 అడుగులకు మా త్రమే అనుమతి రావడంతో ఆ విధంగానే చిట్టినగర్ - విద్యాధరపురం మధ్య టన్నెల్ (సొరంగం) ఏర్పాటైంది. ఇది ఏర్పాటై 60 ఏళ్ల గడిచింది. విద్యాధరపురం, భవానిపురం, గొల్లపూడి, సితార జంక్షన్ నుం చి చిట్టినగర్, కేదారేశ్వరపేట, సత్యనారాయణపురం, గాంధీనగర్ ప్రాంతాల రాకపోకలకు ఈ టన్నెల్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంద్రకీలాద్రి టన్నెల్‌గా నామకరణం చేసిన ఈ సొరంగం విజయవాడ నగరానికి ప్రఖ్యాత చిహ్నంగా నిలిచింది.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ సిటీ)

పంటనష్టం నమోదులో చింతలమడకు అన్యాయం

● రహదారిపై ట్రాక్టర్ అడ్డుపెట్టి పంచాయతీ ఎదుట రైతుల ఆందోళన

● సుంకు రాలి తీవ్రనష్టం.. నిలుచున్న పొలాలను నమోదు చేయాలని డిమాండ్

చల్లపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంట నష్టం నమోదులో అన్యాయం జరిగిందంటూ చింతలమడ గ్రామ రైతులు శుక్రవారం లక్ష్మీపురం పంచాయతీ కార్యాల యం ఎదురుగా ప్రధాన రహదారిపై ట్రాక్టర్ అడ్డుపెట్టి రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. తుఫాను గాలులకు సుంకు రాలిపోయి గింజ పాలుపోసుకునే పరిస్థితి లేదనీ, దిగుబడులు తగ్గిపోతాయనీ, నిలుచున్న పొలాలకు పంటనష్టం నమోదు చేయకపోతే ఎలాగంటూ ప్రశ్నించారు. చింతలమడ చుట్టుప్రక్కల గ్రామాలైన ఘంటసాల మండల పరిధిలోని దాలిపర్రు, దేవర కోట, ఘంటసాల పొలాల్లో నిలుచున్న పొలాలకు పంటనష్టం నమోదు చేసి తమ గ్రామంలో మాత్రం ఎందుకు రాయలేదన్నారు. తుఫాను గాలులు చింతలమడలో లేవా అని ప్రశ్నించారు. పంటనష్టం నమోదులో తమకు అన్యాయం జరిగిందనీ, కొన్ని పడిపోయిన చేలను సైతం నమోదు చేయలేదని ఆరోపించారు. రైతులతోపాటు కౌలురైతులు వ్యవసాయం చేస్తున్నారని, వారికీ న్యాయం చేయాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పంటనష్టంపై స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. చింతలమడ గ్రామ రైతుల పొలాలన్నంటికీ నష్టపరిహారం నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ కొల్లూరు కోటేశ్వరరావు రైతుల వద్దకు వచ్చి మాట్లాడారు.

ఎస్సై, రైతుల మధ్య వాగ్వాదం

రహదారిపై ట్రాక్టర్ ఉంచి ఆందోళన చేపట్టడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు వెనక్కి మళ్లి లక్ష్మీపురం సెంటరు నుంచి హైవే మీదుగా రాకపోకలు సాగించాయి. ఆర్టీసీ బస్సులు మాత్రం నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్సై పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం సంఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. ఫోన్ లో ట్రాక్టర్ తీయాలని సర్పంచ్‌కు సూచించి హోంగార్డును పంపినా స్పందించలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయాణికులను ఇబ్బందులు పెట్టకుండా పంచాయతీ ఎదురు ఆందోళన చేసుకోవాలిగానీ, రోడ్డుపై పెట్టడం సరికాదంటూ ట్రాక్టర్‌ను తీయించే ప్రయత్నం చేశారు. రైతులకు, ఎస్సైకు మధ్య వాగ్వాదం జరిగింది. కొద్దిసేపటి తర్వాత ట్రాక్టర్‌ను తీసేసి అందరూ పక్కకు వచ్చేశారు.



ఎస్సై సుబ్రహ్మణ్యంతో వాగ్వాదానికి దిగిన రైతులు



రైతులతో మాట్లాడుతున్న ఏవో మురళీకృష్ణ

సర్పంచ్ చాంబర్‌లో రైతులతో ఏవో సమావేశం

రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న ఏవో కె.మురళీకృష్ణ, వీఏఏలతో కలిసి లక్ష్మీపురం వచ్చారు. సర్పంచ్ కొల్లూరు కోటేశ్వరరావు సమక్షంలో రైతులతో సమావేశం అయ్యారు. జిల్లా కలెక్టర్, జేడీఏ ఉత్తర్వుల ప్రకారమే తాము నడుచుకున్నామని స్పష్టం చేశారు. దీంతో రైతులు వాగ్వాదానికి దిగారు. చింతలమడకు ఒక ప్రభుత్వం, పక్క మండలాల గ్రామాలకు మరో ప్రభుత్వం ఉంటుందా, అక్కడ రాసినప్పుడు ఇక్కడ ఎందుకు రాయరని ప్రశ్నించారు. ఒక్క వీఏఏ గ్రామమంతా ఎలా తిరిగి పంట నమోదు చేస్తారన్నారు. పడిపోయిన పొలాలు కూడా కొన్ని రాయలేదన్నారు. నమోదు చేసిన జాబితా ఇవ్వాలని పట్టుబట్టారు. ఇతర చోట్ల నిలుచున్న పొలాలకు ఎందుకు రాశారో తనకు తెలియదనీ, తాను మాత్రం నిబంధనల ప్రకారమే రాశానన్నారు. నిబంధనల ప్రకారం పంట నష్టం నమోదులో తప్పులు జరిగితే ఎవరి పొలం నమోదు చేయలేదో స్పష్టంగా తెలియచేస్తే పరిశీలించి న్యా యం చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. నమోదు చేసిన జాబితాలు ఇచ్చే వెళ్లాలంటూ ఏవోను రైతులు అడ్డుకున్నారు. సర్పంచ్, నేతలు జోక్యం చేసుకుని సర్దిచెప్పటంతో కొద్దిసేపటి తర్వాత నష్టపోయిన రైతుల పేర్లు రాసుకుని ఏవో, వీఏఏ వెళ్లారు. రైతులు కొందరు అసభ్యకరంగా మాట్లాడారంటూ ఏవో, వీఏఏ సర్పంచ్ ఎదుట రైతులను నిలదీశారు. ఒకరిద్దరు పరుషంగా మాట్లాడితే తాము క్షమాపణ చెబుతామని పలువురు రైతులు తెలిపారు. చల్లపల్లి సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు, సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, జనసేన నేత సూదాని నందగోపాల్ రైతులు, అధికారులతో మాట్లాడారు.

రైతులందరికీ నష్టమే



తుఫాను గాలులకు వరి సుంకు రాలిపోయింది. సుంకు రాలిపోతే గింజ ఎలా వస్తుంది. పంట నిలుచుని ఉన్నా రైతులకు నష్టమే. నిలుచున్న చేలకు నష్టపరిహారం రాయకుంటే ఎలా? వర్షాలకు పడిపోయిన చేలు తర్వాత ఎండలకు కొంత మేర పైకిలేచి ఉంటాయి. ఆ చేలు కోత కోయాలంటే ఎంత అడుగుతారో? రైతులందరికీ నష్ట పరిహారం నమోదు చేయాలి.

\- కె.నాగేశ్వరరావు, రైతు

పంటనష్టం నమోదు పారదర్శకంగా లేదు



కౌలుకు 58 ఎకరాలు వ్యవసాయం చేస్తున్నా. ఎకరాకు 24 బస్తాలు కౌలు ఇవ్వాలి. ఇప్పటికే ఎకరానికి రూ.30 వేల చొప్పున ఖర్చు చేశా. పొలం నిలుచుని ఉంది. 20 బస్తాల దిగుబడి వస్తుంది. నష్టపరిహారం నమోదు చేయలేం అంటున్నారు. ఎంత వరకు న్యాయమో చెప్పండి. చుట్టుపక్కల గ్రామాల్లో నిలుచున్న పొలానికీ నష్టపరిహారం రాశారు. పంట నష్టం నమోదు పారదర్శకంగా జరగలేదు.

\-నూకల గౌరీశంకర్, కౌలురైతు

నిప్పంటించుకుని వృద్ధుడి ఆత్మహత్య

వన్‌టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా ఉంటున్న వృద్ధుడు ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని మృతి చెందిన సంఘటన గవర్నరుపేటలో శుక్రవారం జరిగింది. గవర్నరుపేట బైరెడ్డి రామన్న వీధిలో ఉండే పి.రామ్‌ప్రసాద్‌కు ఆయన ఇంటి పక్కన ఉన్న మరో భవనంలోని రూమ్‌లను బ్యాచిలర్స్‌కు అద్దెకు ఇస్తుంటాడు. బిల్డింగ్ మొదటి అంతస్తు ఎఫ్‌బి-5 రూమ్‌లో మూడు సంవత్సరాల నుంచి పెరుమత్స వెంకటేశ్వరరావు (64) అద్దెకు ఉంటూ ప్రతినెలా రూ.3 వేలు అద్దె ఇస్తున్నాడు. వెంకటేశ్వరరావు బకింగ్‌హోమ్ పోస్టాఫీసు రోడ్డులో నిమ్మకాయలు అ మ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకుని రెండు నెలల నుంచి వ్యాపారం చేయకుండా రూమ్‌లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున 2.45 గంటలకు వెంకటేశ్వరరావు ఉంటున్న రూమ్ నుంచి పొగ వస్తుందని పక్క రూమ్‌లో ఉన్న సిహెచ్.రామారావు బిల్డింగ్ యజమాని రామ్‌ప్రసాద్‌కు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో రామ్‌ప్రసాద్ వెంకటేశ్వరరావు రూమ్ వద్దకు వచ్చి చూడగా దట్టంగా పొగలు వ్యాపించి ఉన్నాయి. రాంప్రసాద్ తలుపుకొట్టినప్పటికీ ఎలాంటి సమాధానం లేకపోవటంతో పక్కనే ఉన్న ఐరన్ పైపుతో వెంకటేశ్వరరావు రూమ్ గడియను పగులకొట్టి లోపలికి వెళ్లి చూడగా వెంకటేశ్వరరావు శరీరం సగం కాలిపోయి కింద పడి ఉన్నాడు. రామ్‌ప్రసాద్ బాత్రూమ్‌లో ఉన్న బక్కెట్‌తో నీళ్ల తీసుకువచ్చి మం టలను ఆర్పివేశాడు. వెంకటేశ్వరరావు మృతదేహం పక్కన సగం కిరోసిన్ క్యాన్ ఉంది. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామ్‌ప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటేశ్వరరావుకు కుటుంబ సమస్యలు, అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని రామ్‌ప్రసాద్ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

అశోక్ లేల్యాండ్‌లో ఉద్యోగాల పేరిట బురిడీ

హనుమాన్‌జంక్షన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) :మల్లవల్లి ఏపీఐఐసీ పారిశ్రామిక వాడలోని అశోక్ లేల్యాండ్ కంపెనీలో ఉద్యోగాలు భర్తీ పేరుతో సోషల్ మీడియాలో వస్తున్న ప్రకటనలతో నిరుద్యోగ యువత మోసపోతున్నారు. సోషల్ మీడియా ప్రకటనలో సూచించిన సెల్ నెంబరుకు కాల్ చేయగానే కంపెనీ హెచ్‌ఆర్‌ని మాట్లాడుతున్నానంటూ ఓ మహిళ ఆధార్ కార్డు, ఇతర సర్టిఫికెట్లు జిరాక్సు కాపీలతో బెంగళూరులోని కార్యాలయానికి ఇంటర్వ్యూకు హాజరు కావాలని, ఇన్సూరెన్సు ప్రీమియంగా రూ.4వేలు చెల్లించాల్సి ఉంటుందని, ప్లేస్‌మెంట్ అశోక్ లేల్యాండ్ బెంగళూరు, హైదరాబాద్, మల్లవల్లి బ్రాంచిల్లో ఎంచుకుంటే అపాయింట్‌మెంట్ లెటర్ ఇస్తామంటూ నమ్మబలికి మోసం చేస్తోంది. తేలప్రోలు గ్రామానికి చెందిన టీఎస్‌కె.రెడ్డి సోషల్ మీడియా ప్రకటనతో బెంగళూరు వెళ్లి దరఖాస్తు చేయడానికి సిద్ధపడి మిత్రులు హెచ్చరించడంతో విరమించుకున్నాడు. మల్లవల్లి అశోక్‌లేల్యాండ్ కంపెనీ యాజమాన్య ప్రతినిధుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకు వెళ్లగా ఎటువంటి నియామకాలు జరపడం లేదని, అనేక మంది నిరుద్యోగ యువకులు బెంగుళూరు వెళ్లి ఫేక్ లెటర్‌లతో వచ్చి మోసపోతున్నారని కంపెనీ యాజమాన్య ప్రతినిధులు వివరణ ఇచ్చారు. సోషల్ మీడియాలో వస్తున్న ఫేక్ కంపెనీల ప్రకటనలకు యువత మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు.



సైన్స్, డ్రామా పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులు

రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో ఆనందలహరికి ప్రథమ బహుమతి

మచిలీపట్నం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రాష్ట్రస్థాయిలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ డ్రామా పోటీల్లో గుడివాడ ఆంధ్ర నలందా మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి పొందారని డీఈవో పి.వి.జె.రామారావు తెలిపారు. గుడివాడ ఆంధ్ర నలందా విద్యార్థులు ప్రదర్శించిన ఆనందలహరి నాటిక ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈనెల 20, 21 తేదీల్లో బెంగళూరులోని విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజికల్ మ్యూజియంలో దక్షిణ భారతస్థాయి పోటీలకు ఎంపికయిందన్నారు. ఉత్తమ దర్శకునిగా పి.వి. సత్యనారాయణ బహుమతి అందుకున్నారన్నారు. ఎస్‌ఇఆర్‌టీ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులు బహుమతి అందుకున్నారన్నారు. విద్యార్థులను ఈ సందర్భంగా డీఈవో రామారావు, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ జాకీర్ అహ్మద్ అభినందించారు.



పునాదిపాడులో పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటాం : కలెక్టర్ బాలాజీ

కంకిపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మండలంలోని పునాదిపాడు గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. మొంథా తుఫాను కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంట చేతికొచ్చే సమయంలో తుఫాను తమను నట్టేట ముంచిందని రైతులు కలెక్టర్‌కు గోడు వెళ్లబోసుకున్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని టువంటి షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని తప్పకుండా ఆదుకుంటామన్నారు. రైతులకు త్వరితగతిన నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ నవీన్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జ్యోతి, ఉయ్యూరు ఆర్డీవో హేలా షారోన్, తహసీల్దార్ భవన్నారాయణ, రైతులు పాల్గొన్నారు.

చరిత్రహీనుడు జోగి రమేశ్ : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రజల పార్టీ కాదని, మద్యం మాఫియా పార్టీ అని, మద్యం కుంభకోణంలో వైసీపీ పెద్దలెందరో బయటపడుతున్నారని మాజీ ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కల్తీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ పాత్ర బట్టబయలైందన్నారు. కల్తీ మద్యం కేసు నుంచి కులం కార్డుతో బయటపడాలని చూసిన జోగి రమేశ్ పప్పులు ఉడకలేదన్నారు. చరిత్ర హీనులకు గౌడ సమాజం అండగా ఉండదన్నారు. కల్తీమద్యం కుంభకోణం జరుగుతుంటే వైసీపీ పెద్దల అండదండలు లేకుండా ఎలా ఉంటాయన్నారు. జోగి రమేశ్‌ను సమర్థించే వైసీపీ నాయకులకు సిగ్గు ఉండాలన్నారు. బత్తిన దాసు, వంకా వెంకటేశ్వరరావు, యార్లగడ్డ సీతారామయ్య, వేముల కృష్ణారావు పాల్గొన్నారు.

కల్తీ మద్యం దోషుల ఆస్తులు జప్తు చేయాలి : కొలికపూడి

తిరువూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం కేసులో దోషుల ఆస్తుల్ని జప్తు చేయాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే జోగి రమేష్ కల్తీ మద్యం అమ్మకాలు చేసి ఎంతో మంది మృతికి కారణమయ్యాడని ఆరోపించారు. జోగి బినామీలందరూ కటకటాల పాలవుతున్నారన్నారు. కల్తీ మద్యం కేసులో అరెస్టులే కాకుండా దోషుల ఆస్తుల్ని జప్తు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పెట్టుబడులను అడ్డుకునేందుకు జగన్‌రెడ్డి కుట్ర : దేవినేని ఉమా

గొల్లపూడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులను అడ్డుకునేందుకు జగన్మోహన్ రెడ్డి విద్వేషపూరిత కుట్రకు తెరలేపుతున్నాడని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపిం చారు. గొల్లపూడి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ, విదేశాల నుంచి పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఆసక్తి చూపిస్తుంటే, జగన్‌రెడ్డి ద్వేషపూరిత వ్యాఖ్యలతో రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. ఇంటెలిజెన్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రముఖ విద్యాసంస్థలతో ఆర్‌టీఐహెచ్ ఎంవోయూలు

కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నవ్య ఆవిష్కరణలను, స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (విజయవాడ) ప్రముఖ విద్యాసంస్థలు, కళాశాలలతో అవగాహన ఒప్పందాలు కదుర్చుకొంటున్నట్లు జేసీ ఎస్.ఇలక్కియా తెలిపారు. ఆర్‌టీఐహెచ్ విజయవాడ స్పోక్, వివిధ కళాశాలల మధ్య అవగాహన ఒప్పందాలు శుక్రవారం కుదిరాయి. మంచి ఆలోచనలకు కార్యరూపమిచ్చి కొత్త పరిశ్రమల స్థాపన దిశగా యువతను నడిపించేందుకు ఆర్‌టీఐహెచ్ కృషిచేస్తోందన్నారు లయోలా, ధనేకుల, ఎస్ఆర్‌కే ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్‌టీఐహెచ్ ఎంవోయూలు కుదుర్చుకున్నట్లు జేసీ ఇలక్కియా వివరించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

కులదూషణ కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలుశిక్ష

పామర్రు,నవంబరు7(ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనాన్ని అతివేగంగా నడుపుతున్నారని అడిగినందుకు కులం పేరుతో దూషించడంతోపాటు, దాడిచేసిన కేసులో ఇద్దరు నిందితులపై నేరం రుజువు కావడంతో వారికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.5వేల రూపాయల జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేకకోర్టు న్యాయమూర్తి బాబూనాయక్ శుక్రవారం తీర్పు చెప్పారు.2020జనవరి 6వతేదీ రాత్రి సమయంలో పామర్రుసెంటరులో బూరగడ్డ మణికంఠరామకృష్ణ, మామిళ్ల పవన్‌కల్యాణ్ వేగంగా ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్నారు. అంతవేగంగా వాహనం ఎందుకు నడుపుతున్నారని, ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని కే వినోదరావు వారిని ప్రశ్నించాడు. దీంతో వారు వినోదరావు కులంపేరుతో దూషించడమేకాక ఆయనపై దాడి చేశారు. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదుమేరకు పామర్రు పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసులో 12మంది సాక్షులను విచారించి తీర్పు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో-1 రజనీ

ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు వసతుల ఏర్పాటు

గుడివాడ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉచితంగా అన్ని వసతులు ఏర్పాటు చేస్తుందని ఎంఈవో -1 రజని అన్నారు. గుడివాడ మండలంలో ఏపీవో కో-ఆర్డినేటర్ ఏడుకొండలు ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలకు మెడికల్ క్యాంప్, ఉచిత పరికరాలు కావాల్సిన వారిని గుర్తించి వారికి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య శిబిరం అనంతరం పిల్లలకు అవసరమైన వస్తు సామగ్రిని ఉచితంగా అందజేయనున్నామన్నారు. వారు చదువుకోవటానికి చక్కటి వసతులు, ప్రత్యేక తరగతి గదులు ఏర్పాట్లు చేయనున్నామన్నారు. వీరికి ప్రత్యేక వైద్యసదుపాయాలు అన్ని ఏర్పాటు చేశామన్నారు. గుడ్లవల్లేరు-2 గోపాల్, నందివాడ ఎంఈవో-2 డేవిడ్ రత్నరాజు, పెదపారుపూడి ఎంఈవో-2 సురేష్‌బాబు, బాలాజీ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గుడివాడ రూరల్ : మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ అన్నారు. శుక్రవారం మండలంలోని బిళ్లపాడులో కేటీఆర్ మహిళా కళాశాల విద్యార్థులకు, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణపై ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరమణ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. వాటి వల్ల ఎన్నో కుటుంబాలు నష్టపోతున్నాయన్నారు. ప్రత్యేకంగా యువత వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరికి గాయాలు

గుడివాడ : స్థానిక గుడివాడ-విజయవాడ రైల్వే ఓవర్ బ్రిడ్జిపైన భాస్కర్ థియేటర్ సమీపంలో ఈ నెల 4వ తేదీన రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో స్థానిక బేతవోలుకు చెందిన గుదే అంబేడ్కర్‌కు కుడి మోచెయ్యి, కుడి మోకాలు, మునివేళ్లలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అంబేడ్కర్‌ను స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ ఎస్సై పి.లోవరాజు తెలిపారు.

పసరు నీరు తాగేదెలా..!

● రంగుమారిన చెరువు నీరు
● పాడైన ఫిల్టర్‌బెడ్‌లు
● పట్టించుకోని అధికారులు

(గుడ్లవల్లేరు - ఆంధ్రజ్యోతి) : పంచాయతీ తాగునీటి సరఫరా సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యం కారణంగా రక్షిత తాగునీరు కాస్తా బురదనీరుగా సరఫరా అవుతోంది. స్థానిక విన్నకోట గ్రామంలో రక్షిత తాగునీటి పథకం ద్వారా కుళాయిలకు సరఫరా చేస్తున్న తాగునీరు రంగుమారి మురుకిగా వస్తున్నాయి. తాగునీటికోసం వినియోగిస్తున్న పంచాయతీ కార్యాలయం ప్రక్కనే ఉండే చెరువుకు ఇన్‌లెట్, ఔట్‌లెట్ ఒకే వాటర్ పైపుద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. దీనికి తోడు ఐదేళ్ల నుంచి ఈ చెరువులో నీటిని క్లోరినేషన్ చేయడం లేదు. దీంతో చెరువులోని నీరంతా పచ్చగా మారింది. అంతేకాక చెరువలో క్యాట్‌ఫిష్ ఎక్కువగా ఉండటంతో నీరు బురదలుగా మారుతున్నాయి. దీంతో నీటిని శుద్ధి చేసే ఫిల్టర్ బెడ్‌లు సైతం పాడైపోతున్నాయని పలు విమర్శలు వినవస్తున్నాయి. పంచాయతీ వారు సరఫరా చేసే నీరు మురుకిగా ఉండటంతోపాటుగా తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్థులు వాపోతున్నాయి. ఈ నీటిని కనీసం పశువులకు సైతం పెట్టలేని దుస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే మురికినీరు, దాన్ని కాస్తైనా ఫిల్టర్ చేసి నీటిని సరఫరా చేస్తున్నారనుకునే లోగా ఫిల్టర్ బెడ్‌లోకి నీటిని తోడే మోటారు సైతం పాడైపోయింది. దీంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. చెరువులో నీరు అంతా తోడేసి క్లోరినేషన్ చేసి కొత్త నీరు పట్టి అపుడు ఫిల్టర్ చేస్తేనే కానీ తాగునీరు పరిశుభ్రంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పాడైన తాగునీటి మోటారుకు మరమ్మతులు చేయించి, ఫిల్టర్ బెడ్‌ల ద్వారా శుద్ధి చేసిన తాగునీటిని అందించాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువులో నీరు పాడైన మాట వాస్తవమే

చెరువులో నీరు పాడైన మాట వాస్తవమే. ఈ పంచాయతీకి ఇన్‌చార్జ్‌గా ఇటీవలే వచ్చాను. చేరువలోని నీటిని తోడించి, శుద్ధి చేసిన సురక్షిత తాగునీరు సరఫరా చేసేందుకు కృషి చేస్తా.

నరసింహారావు , పంచాయతీ కార్యదర్శి



బురదగా మారిన తాగునీటి చెరువులో నీరు



ఫిల్టర్ బెడ్ సరిగా పనిచేయక పచ్చగా ఉన్న తాగునీరు

లబ్ధిదారుడికి ప్రమాదబీమా చెక్కు పంపిణీ

పామర్రు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మృతిచెందిన కుటుంబాలకు టీడీపీ ఆర్థికంగా అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండల పరిధిలో జుజ్జవరం గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన టీడీపీ కార్యకర్త కురిచేటి రవి కుటుంబానికి మంజూరైన రూ. 5లక్షల ప్రమాదబీమా చెక్కును శుక్రవారం వారి ఇంటి వద్దకు వచ్చి ఎమ్మెల్యే అందజేశారు. ఏఎంసీ చైర్మన్ జన్నుశోభనబాబు పాల్గొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

గుడివాడ : వలివర్తిపాడులోని గణేష్ అపార్టుమెంట్ సమీపంలో యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తి హత్యాయత్నం చేసినట్టు గుడివాడ తాలుకా ఎస్సై ఎన్.చంటిబాబు అన్నారు. గుడివాడకు చెందిన పౌల్ట్రీ వ్యాపారి దేవదత్త చౌదరి వద్ద కోళ్ల వ్యాన్‌లో లోడింగ్ పనుల నిమిత్తం బీహార్‌కు చెందిన కునాల్, సునీల్ అనే యువకులు పనిచేస్తున్నారు. ఈనెల 5వ తేదీ కునాల్ తమ్ముడు చందన్‌కుమార్ అతని స్నేహితుడు అన్నుకుమార్‌లు ఇటీవల కునాల్ వద్దకు వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. కునాల్, సునీల్‌లు కోళ్ల లోడింగ్‌కు వెళ్లగా, రాత్రి సుమారు ఒంటి గంట సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి అన్నుకుమార్‌పై పదునైన ఆయుధంతో పొట్టలో పొడిచి పరారయ్యాడు. దాడి జరిగిన విషయాన్ని అన్న కునాల్, యజమాని దేవదత్త చౌదరిలకు సమాచారం అందించారు. దేవదత్త చౌదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

● సీఈవో నాగమల్లేశ్వరరావు

గుడ్లవల్లేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా కృషి చేస్తామని విన్నకోట జనార్దన స్వామి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) సీఈవో నాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు. విన్నకోట జనార్దన స్వామి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)లో 2022-23 సార్వా సీజన్ కు సంబంధించిన రైతులకు ఇవ్వవలసిన హమాలీ చార్జీలను శుక్రవారం సొసైటీ ప్రాంగణంలో రైతులకు పంపిణీ చేశారు. ఒక్కో బస్తాకు రూ.10 చొప్పున హమాలీ చార్జీలు ఈ సొసైటీ పరిధిలో 963 మంది రైతులకు రూ.15 లక్షలు విడుదలయ్యాయి. అప్పట్లో 623 మందికి రూ.10.11 లక్షలు చెల్లించామనీ, మిగిలిన రైతులు రాకపోవడంతో చెల్లించలేదని సీఈవో తెలిపారు. కాగా దీనికి సంబంధించి ఇంకా సివిల్ సప్లయ్స్ నుంచి రూ.2.71 లక్షలు రావాల్సి ఉన్నప్పటికీ సొసైటీ కరెంట్ ఎకౌంట్ నుంచి చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఇటీవలే సొసైటీకి నూతనంగా నియమితులైన త్రిమెన్ కమిటీ సభ్యులు రైతులు హమాలీ చార్జీలు పొందలేదన్న విషయాన్ని గుర్తించి రైతుల డబ్బు ఆగటమే మిటని చార్జీలు పొందని రైతులకు వెంటనే చెల్లించాలని సొసైటీ అధికారులకు సూచించారు. త్రీమన్ కమిటీలోని మన్స్ యేసుకుమార్, వెంకట సత్యనారాయణ, జనసేన జిల్లా కార్యదర్శి జగన్‌లు రైతులను సర్దిచెబుతూ సొసైటీకి సంబంధించి సమస్యలు ఉన్నా సర్వ సభ్య సమావేశంలో విన్నవించాలన్నారు. అనంతరం 49 మంది రైతులకు రూ. 1,11,590లు పంపిణీ చేశామని సీఈవో తెలిపారు.



రైతులకు హమాలీ చార్జీలు చెల్లిస్తున్న త్రిమెన్ కమిటీ

పన్నులు ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి

● రావి శ్రీనివాసరావు

తోట్లవల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణ పంచాయతీలో భాగంగా 2025-26 సంవత్సరానికి ఇంటి పన్నులు, నీటి పన్నులు ఆన్‌లైన్‌లోనే ప్రజలు చెల్లించాలని, రశీదులు పొంది వ్యక్తిగతంగా పన్నులు కట్టే విధానానికి స్వస్తి చెప్పాలని తోట్లవల్లూరు పంచాయతీ కార్యదర్శి రావి శ్రీనివాసరావు తెలిపారు. గ్రామ సచివాలయంలో క్యూఆర్ కోడ్ స్టిక్కర్‌ను సిద్ధం చేశామని, తమ ఫోన్‌ల నుంచి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఇంటి పన్నులు చెల్లించాల్సి ఉందన్నారు. దీని వల్ల ఎలాంటి అక్రమాలు జరిగేందుకు అవకాశం లేదని తెలిపారు. నేరుగా పంచాయతీకి పన్నులు జమవుతాయని కార్యదర్శి చెప్పారు.

గుడ్లవల్లేరు :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వాట్సాప్ గవర్నెస్ డోర్‌టూ డోర్ సర్వే కార్యక్రమాన్ని, అవగాహనా కార్యక్రమాలను గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్వహించారు. అలానే స్వర్ణ పంచాయతీలో భాగంగా ఇంటి పన్నులు చెల్లించేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశామని పంచాయతీ కార్యదర్శి నరసింహారావు తెలిపారు. ఇంటి పన్ను చెల్లించే వారు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఫోన్ పే చేయవచ్చని ఆయన తెలిపారు .కార్యక్రమాల్లో పంచాయతీ ప్రత్యేకాధికారి ఎంపీడీవో మహ్మద్ ఇమ్రాన్, శానటరీ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్‌ను చూపుతున్న కార్యదర్శి శ్రీనివాసరావు

మొవ్వ డిప్యూటీ ఎంపీడీవోగా త్రినాథ్

కూచిపూడి: మొవ్వ డిప్యూటీ ఎంపీడీవోగా పి.త్రినాథ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కోనసీమ నుంచి గ్రేడ్ -1 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై మొవ్వకు బదిలీ అయ్యారు. ఇంచార్జ్ ఈవోపీఆర్‌డీ వీరహనుమాన్ గౌడ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు.

వాట్సాప్ గవర్నెన్స్ సేవలను వినియోగించుకోవాలి

● డిప్యూటీ ఎంపీడీవో జనార్దనారావు

పామర్రు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పామర్రు డిప్యూటీ ఎంపీడీవో పసుమర్తి జనార్దనారావు పేర్కొన్నారు. స్థానిక 3,4,5 గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం ఇంటింటా వాట్సాప్ ద్వారా ప్రభుత్వం అమలుచేసే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకే ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టిందన్నారు. ధ్రువ పత్రాలకోసం ఎవరూ ఇబ్బందులు పడకూడదనే ఆలోచనతో ఈవాట్సాప్ గవర్నెన్స్ తీసుకోచ్చిందన్నారు. వాట్సాప్ ఉంటే చాలు పైనెంబరుతో మనమిత్ర యాప్ ద్వారా దాదాపు 360సేవలను ప్రజలు పొందవచ్చని వివరించారు. పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం ప్రభుత్వ సేవలు వాట్సాప్ ఎలా పొందవచ్చనే దానిపై ప్రజలకు సమగ్రంగా వివరించారు. అదేవిధంగా ప్రజలు ప్రభుత్వం అందించే సేవల్లో ఎవైనా ఇబ్బందులుంటే వాట్సాప్ నెంబరు 9552300009 కు ఫిర్యాదు చేసుకోవచ్చునన్నారు. అంతేకాకుండా విద్యుత్‌బిల్లులు, ఇంటి పన్నులు, ఆస్తి పన్నులు చెల్లించుకోవచ్చునని ప్రజలకు వివరించారు. ఇంటింటా పర్యటనలో గ్రామ సచివాలయ కార్యదర్శులు బోసుబాబు, తిరుమల, పూజ, వైష్ణవి, నవీన్, పవిత్ర, ఉమాప్రతాప్ అధికార సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జనార్దనారావు

పేద విద్యార్థులకు సాయం అభినందనీయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

కూచిపూడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ఆర్థిక సాయమందించటం అభినందనీయమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. కాజ గ్రామానికి చెందిన లంకే ఉమాలక్ష్మీ నాంచారమ్మ, తాతా అంకమ్మ, రాజులపాటి జయశ్రీ, యార్లగడ్డ రితికకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున తాతా నారాయణరావు, మేకా వెంకటేశ్వరరావులు అందించిన ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే కుమార్ రాజా శుక్రవారం సాయంత్రం విద్యార్థులకు అందించి దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబాలకు సాయం

ఇటీవల కాజ గ్రామానికి చెందిన ఉప్పలపు రాంబాబు గృహం దగ్ధమైంది. బాధిత కుటుంబసభ్యులను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పరామర్శించారు. ఈ సందర్భంగా కూటమి నేతల సహకారంతో 23 వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందిజేశారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ శ్రీనివాసరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

ప్రజలకు సత్వర సేవలందించాలి

పామర్రు,నవంబరు7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై గ్రామ సచివాలయాలకు వచ్చే ప్రజలకు సత్వర సేవలందించే బాధ్యత గ్రామ సచివాలయ ఉద్యోగులపై ఉందని పామర్రు డిప్యూటీ ఎంపీడీవో పి.జనార్దనరావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఒకటి,రెండు గ్రామ సచివాలయాలను కార్యదర్శి అబ్దుల్ సలీంతో కలసి ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రజలకు అందిస్తున్న సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. సచివాలయ కార్యదర్శులు నెరుసు నరేష్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్ కార్యదర్శులు పల్లవి, వెంకట కిషోర్,రాజేశ్వరి, నిహారిక పాల్గొన్నారు.

హాకీ, స్కేటింగ్ పోటీల్లో కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ :విశాఖపట్నంలో ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన అంతర్ జిల్లాల రోలర్ హాకీ, స్కేటింగ్ పోటీల్లో స్థానిక డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ పాఠశాల విద్యార్థులు పలువురు పతకాలు సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక పాఠశాల ఆవరణలో పతకాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల క్యాడెట్ కేటగిరిలో పి.కారుణ్య, పి.నేహ, జె.స్నిగ్ధలు ద్వితీయ స్థానం సాధించారు. సబ్ జూనియర్ కేటగిరిలో జె.జాహ్నవి తృతీయ స్థానం, టైనీ టాట్స్ కేటగిరిలో వి.చేతనకృష్ణ, బి.ప్రవర్షిణి రామరాజ్, కె.పరిణితలు ద్వితీయ స్థానం సాధించినట్టు తెలిపారు. విద్యార్థులను, కోచ్ పి.ఎన్.వి.ఎన్ అయ్యప్పలను పాఠశాల ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు,

ముందస్తు పరీక్షలతోనే కేన్సర్ నివారణ

తోట్లవల్లూరు : కేన్సర్‌పై భయాన్ని వీడాలని, అనుమానం కలిగిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా ముందస్తుగా పరీక్షలు చేయించుకుంటే కేన్సర్‌కు చికిత్స తీసుకుని బయట పడవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారిణి టి. సాయిప్రసన్న అన్నారు. తోట్లవల్లూరు పీహెచ్‌సీలో శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి ర్యాలీ చేశారు.

వైసీపీ నాయకులకు సిగ్గుండాలి

● పీఏసీఎస్ అధ్యక్షుడు చీకటి శేషగిరిరావు

గుడివాడ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని, అసాంఘిక శక్తులను వెనుకేసురావడం వైసీపీ నాయకులకు సిగ్గు ఉండాలని మోటూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చీకటి శేషగిరిరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 420, చీటింగ్, ఫోర్జరీ, ఎస్సీ, ఎస్టీ వేధింపులు, బ్లాక్ మెయిలింగ్ వంటి కేసులు వైసీపీ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి ఘంటా శ్రీనివాసరావుపై నమోదయ్యాయన్నారు.టీడీపీ గ్రామ కోశాధికారి మానేపల్లి సురేష్, గంగానమ్మ దేవస్థానం చైర్మన్ ఆనందాసు వెంకటరామయ్య, నాయకులు దగ్గుమిల్లి బద్రి, ఘంటా వంశీ తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మ సంబరాలు ప్రారంభం

గుడ్లవల్లేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు గ్రామ దేవత గంగానమ్మ అమ్మవారి సంబర మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. తెల్లవారు జామున 3 గంటల నుంచి 5.30 గంటల వరకూ అమ్మవారి మేలుకొలుపు, ఉదయం 7 గంటలకు అమ్మవారికి స్నానము, పోతురాజు గడ, ఘటాలు, పొలిమేరల వద్ద అమ్మవారి ముగ్గు, కుంబం పోయుట, సాయంత్రం మారెమ్మను సాగనం పుట కార్యక్రమాలు నిర్వహించారు. కాగా శనివారం గ్రామంలో ప్రతీ ఇంటి నుంచి చల్దినైవేద్యం అమ్మవారికి నిర్వాహకులు సేకరించి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమాల్లో వల్లభనేని వెంకటరావు, ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు,రామకోటేశ్వరరావు, వల్లభనేని వెంకటసుబ్బారావుచౌదరి, కొమ్మనబోయిన రాము, రవిశేఖర్, సుబ్రహ్మణ్యం, ఈశ్వరరావు, దుర్గారావు, సుబ్బు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పుల్లేరు వద్ద పోతురాజు గడతో భక్తులు

పదిలో ఉత్తీర్ణతా శాతం పెంచాలి

కూచిపూడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఉయ్యూరు డివిజన్ ఉప విద్యాధికారిణి పద్మారాణి తెలిపారు. పెడసనగల్లు, కూచిపూడి జడ్పీ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షా కేంద్రాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ కేంద్రాల్లో వసతులు పరిశీలించి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేశారు. ఆమెతోపాటు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ విజయకుమారి, ఎంఈవో -2 కె.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

కేటీఆర్‌లో మెగా జాబ్‌మేళా

గుడివాడ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కేటీఆర్ మహిళా కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమం విజయవంతమైంది. జాబ్ మేళాలో వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొని నిర్వహించిన ఇంటర్వ్యూల్లో అభ్యర్థులు పాల్గొన్నారు. తొలుత జాబ్‌మేళాను కళాశాల చైర్మన్ పర్వతనేని నిర్మల ప్రారంభించారు. జాబ్‌మేళాను యువ త సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుష్మ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ నరేష్ కుమార్, జిల్లా ఉపాధి కల్పన అధికారి విక్టర్‌బాబు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి మధుకుమార్ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో పెదముత్తేవి హైస్కూల్ విద్యార్థిని ప్రతిభ

కూచిపూడి : స్థానిక పెదముత్తేవి శ్రీలక్ష్మీపతి స్వామి విద్యావిహార్ జడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఏ.గోపిక ఈ నెల 5వ తేదీన గుడివాడలో నిర్వహించిన అండర్-14 వాలీబాల్ పోటీలలో అద్భుత ప్రతిభ కనబర్చి కృష్ణా జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయినీ మాధవి తెలిపారు. ఎంపికైన విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ ముత్తేవి గౌరవ కృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. పీఈటీ వర్మ, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థికి అభినందనలు తెలిపారు.

ఘనంగా వందేమాతర గీతం స్మారకోత్సవం



జాతీయ జండాలను ప్రదర్శిస్తున్న సిబ్బంది

గుడివాడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) :వందేమాతరం గీతానికి 150సంవత్సరాలు పూర్తైన సందర్భంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వందేమాతరం గీత రచయిత బంకిమ్ చంద్ర చటర్జీ చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పమిడిముక్కల: వందేమాతరం నినాదం వెయ్యి పిరంగులకు మించిన భయాన్ని బ్రిటీష్ వారిలో పుట్టించిందని పలువురు వక్తలు కొనియాడారు. 150 సంవత్సరాల జాతీయ గీతం స్మారకోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వందేమాతరం గీతం ఆలపించి వందేమాతర ఉద్య మం గురించి తెలియజేశారు. ఎంపీపీ వేదసుప్రజ, వైస్ ఎంపీపీ కె.మహేశ్, ఎంపీడీవో సీతారామరాజు, పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : వందేమాతరం గేయాన్ని రచించి 150 సంవత్సరాలైన సందర్భంగా వందేమాతర గీత సంస్మరణ వేడుకలు గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించారు. తొలుత బకించంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గుడివాడ రూరల్: వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు అయిన సందర్భంగా గుడివాడ రూరల్‌లోని మోటూరు, గంగాధర పురం పాఠశాల విద్యార్థులకు మండల కార్యాలయంలో శుక్రవారం వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విష్ణు ప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూచిపూడి : వందేమాతర గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మొవ్వ వీఎస్ఆర్ ప్రభుత్వ, డిగ్రీ, పీజీ కళాశాలల్లో జరిగిన కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ శివనాగేశ్వరరావు, అధ్యాపకులు ఎం.సుందరరావు, రజనీకాంత్, కరుణశ్రీ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదపారుపూడి : మండల పరిధిలోని యలమర్రు, వెంట్రప్రగడ, వానపాముల, దోసపాడు, పెదపారుపూడి గ్రామాల్లోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో వందేమాతరం గీతాలాపన చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మధుమోహన్ రెడ్డి, కిషోర్, రాఘవేంద్ర రావు, పద్మావతి, నాగమల్లేశ్వర రావు, పద్మజ, సాంబశివరావు, సుబ్బారావు, సోమేశ్వర రావు, విజయకుమార్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

కులదూషణ కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

మచిలీపట్నం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని అతివేగంగా నడుపుతున్నారని అడిగినందుకు కులం పేరుతో దూషించడంతో పాటు, దాడిచేసిన కేసులో ఇద్దరిపై నేరం రుజువు కావడంతో వారికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేకకోర్టు న్యాయమూర్తి బాబూనాయక్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు 2020 జనవరి 6వ తేదీన రాత్రి సమయంలో పామర్రు సెంటరులో బూరగడ్డ మణికంఠరామకృష్ణ, మామిళ్ల పవన్‌కల్యాణ్ వేగంగా ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్నారు. ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని కె.వినోదరావు వారిని ప్రశ్నించాడు. దీంతో వారు వినోదరావును కులంపేరుతో దూషించి, దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదుచేశారు. సాక్షులను విచారించిన కోర్టు నేరం రుజువు అయిందని తీర్పుచెప్పింది.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

• ప్రజా దర్బార్‌లో 110 అర్జీలు స్వీకరించిన మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శుక్రవారం బృందావన్ థియేటర్ వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 110 మంది నుంచి ఆయన వినతులను స్వీకరించారు. మెంథా తుఫాను సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం జవాబుదారీగా పనిచేసిందని, ప్రాణ నష్టం జరగకుండా నివారించగలిగిందని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ కుంచే నాని, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బచ్చుల బోసుబాబు, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకే నారాయణప్రసాద్, బచ్చుల అనిల్‌కుమార్, వెంకటస్వామి, ననకా నాగులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

బీమా చెక్కు అందజేత

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త సైకం పూర్ణచంద్రరావు భార్య సైకం సక్కుబాయికి రూ.5 లక్షల బీమా చెక్కును మంత్రి కొల్లు రవీంద్ర అందజేశారు.

సాధ్యనమైనంత త్వరగా అర్జీలు పరిష్కరిస్తాం

• ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్ డేలో వచ్చిన అర్జీలను పరిశీలించి అధికారుల సహకారంతో వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. తోటమూలలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆయన గ్రీవెన్స్‌డే నిర్వహించి వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అప్పటికప్పుడే కొన్ని అర్జీలను పరిష్కరించారు. టీడీపీ నాయకులు యక్కల శ్యామలయ్య, బొర్రా కాశీ, వడుగు తులసీరావు, కూనపరెడ్డి వీరబాబు, కమ్మగంటి బాబు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



రోగుల సహాయకులకు నిర్మించిన షెడ్డును ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

జిల్లా సర్వజనాస్పత్రిని మరింత అభివృద్ధి చేస్తాం

• మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సర్వజన ప్రభుత్వాస్పత్రిని మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా ఐడీబీఐ బ్యాంకు సహకారంతో ఆస్పత్రిలో వెయిటింగ్ హాల్, బ్యాటరీ బేకప్ పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రాన్ని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. బీజేపీ నాయకుడు పంతం గజేంద్ర, గొర్రెపాటి గోపీచంద్, దేవరపల్లి అనిత, ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ ఫణికుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి ప్రణాళికలు : మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని, దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శుక్రవారం 39వ డివిజన్ గొడుగుపేటలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు చేశారు. నగరంలో అంతర్గత డ్రెయినేజీల ప్రక్షాళనకు రూ.73 కోట్లు వెచ్చించనున్నామని, తాగునీటి సమస్యను తీరుస్తామని తెలిపారు. త్వరలో రుద్రవరంలోని గృహాలను పూర్తి చేసి అందిస్తామని, కొత్తగా గృహాలు నిర్మించుకునే వారి కోసం ప్రభుత్వం రూ.2.50 లక్షల సహాయం అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, డివిజన్ ఇన్‌చార్జి రాము, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పీవీ ఫణికుమార్ దంపతులను సత్కరిస్తున్న ఇంజనీర్ ఆర్.వి.ఎస్.మురళీధర్ తదితరులు

పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి

• బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి.ఫణికుమార్

మచిలీపట్నం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు, పార్టీకి తాను చేస్తున్న సేవలను గుర్తించి సీఎం చంద్రబాబు ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని, పేద బ్రాహ్మణులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తానని బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పీవీ ఫణికుమార్ తెలిపారు. 45వ డివిజన్‌లో శుక్రవారం పీవీ ఫణికుమార్, విమలా గాయత్రి దంపతులను ఇంజనీర్ ఆర్.వి.ఎస్. మురళీధర్, డాక్టర్ బొల్లా ప్రసాద్ సత్కరించారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడారు. వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారన్నారు. గంజాల రవికుమార్, కొనకళ్ల భానుప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చెక్‌పోస్టును ప్రారంభిస్తున్న కూటమి నేతలు

ఏఎంసీ చెక్‌పోస్టు ప్రారంభం

కోడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోడూరు శివారు స్వతంత్రపురంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నూతన చెక్‌పోస్టును నియోజకవర్గ యువనాయకుడు మండలి వెంకట్రామ్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. దివి ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, వైస్‌చైర్మన్ రాజనాల వీరబాబు, డైరెక్టర్లు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

పెడన, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భట్ల జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1972-73 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం జరిగింది. వివిధ ప్రాంతాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తాము చదువుకున్న నాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. సమ్మేళనం అనంతరం ఆలయ ఆవరణలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. బళ్ల నాగేశ్వరరావు, నందం చిన బాబు, సింగంశెట్టి ఆదినారాయణ, పేరిశెట్టి ఓంకారం, పేరిశెట్టి యోగానంద్ నేతృత్వం వహించారు.

అగ్నిబాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కోడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పిట్టల్లంక గ్రామంలో ఇటీవల కైలా శరత్‌కు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా దగ్ధమైంది. శుక్రవారం బాధిత కుటుంబాన్ని జనసేన గ్రామ నాయకులు పరామర్శించి రూ.10 వేలు, బియ్యాన్ని అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు మర్రే గంగయ్య, పిట్టలంక సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ బావిశెట్టి ప్రభాకర్‌రావు, బడే వీర వెంకటరావు, కంచర్లపల్లి వెంకటరమణ, కడవకొల్లు రాజేష్, పేర్ని మణికంఠ, పేర్ని ప్రసన్న, కొడాలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మండలి వెంకట్రామ్ చేయూత

కైలా శరత్ కుటుంబాన్ని నియోజకవర్గ యువనాయకుడు మండలి వెంకట్రామ్ పరామర్శించారు. ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. గ్రామీణ యువజన వికాస సమితి తరఫున నూతన వస్త్రాలు, దుప్పట్లు, ఆర్థిక సహాయం అందించారు.

కొడాలిలో బీసీ వనసమారాధన

ఘంటసాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీ సంఘ మండల అధ్యక్షుడు వీరంకి నాగరాజు ఆధ్వర్యంలో కొడాలిలోని గౌడ పాలెంలో శుక్రవారం బీసీ వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ సంఘీయులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

దేశభక్తిని ప్రబోధించిన వందేమాతరం

పెడన, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం గేయం ప్రజలకు దేశభక్తిని ప్రబోధించిందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లు అయిన సందర్భంగా ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం తోటమూల జడ్పీ హైస్కూల్‌లో వందేమాతరం జాతీయ గీతాలాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంఈవో ఎస్.సలోమి, ఎంఈవో-2 వై.వి. హరనాథ్, హెచ్‌ఎం సీహెచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



వందేమాతరం గీతాలాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



కోడూరులో వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న కూటమి నాయకులు, అధికారులు

కోడూరు, అవనిగడ్డ, నాగాయలంకలో..

కోడూరు/అవనిగడ్డ/నాగాయలంక: కోడూరులో కూటమి నాయకులు, అధికారులు వందేమాతర గీతాన్ని ఆలపించారు. ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, మర్రె గంగయ్య, కొండవీటి సునీత, బోలెం నాగమణి, మాచవరపు ఆదినారాయణ, కనగాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. నాగాయలంక మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులు వందేమాతరం గేయాలన్ని ఆలపించారు. అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం విభాగం-2 ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి అధ్యక్షతన వందేమాతరం గీతాన్ని విద్యార్థులు, అధ్యాపకులు ఆలపించారు.

కేయూలో..

మచిలీపట్నం టౌన్: కృష్ణా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో ఉపకులపతి కూన రాంజీ వందేమాతరం గేయ విశిష్టతపై మాట్లాడారు.



వందేమాతరం గేయాలాపన కార్యక్రమంలో పాల్గొన్న ఉపకులపతి కూన రాంజీ

మేకా వెంకటేశ్వరరావుకు టీడీపీ శ్రేణుల నివాళి

మోపిదేవి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెదప్రోలు పీఏసీఎస్ మాజీ డైరెక్టర్, శివరామపురం గ్రామానికి చెందిన మేకా వెంకటేశ్వరరావు ఇటీవల ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించారు. గ్రామంలోని ఆయన ఇంటి వద్ద టీడీపీ శ్రేణులు శుక్రవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వెంకటేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, రావి నాగేశ్వరరావు, చం దన రంగారావు, మోర్ల జయలక్ష్మి, రావి రత్నగిరి, బళ్లా సీతారామప్రసాద్, పుప్పాల యేసు, డొకిపర్తి బాలకోటేశ్వరరావు, మేడికొండ విజయ్, కర్రా సుధాకర్, నాగినేని శేషగిరిరావు పాల్గొన్నారు.



మేకా వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

స్కూల్‌గేమ్స్ రాష్ట్ర పోటీలకు ఎంపికయిన విద్యార్థులు

• నాగాయలంక, ఎదురుమొండి హైస్కూల్స్ నుంచి..

నాగాయలంక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో గూడూరులో నిర్వహించిన పోటీల్లో 17 మంది విద్యార్థులు ప్రధాన ప్లేయర్లుగా, ఒకరు స్టాండ్ బై ప్లేయర్‌గా రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఆలపర్తి సత్యనారాయణ తెలిపారు. అండర్-17 సాఫ్ట్‌బాల్ బాలికల విభాగంలో పి.లీలశ్రీ, ఎం.దివ్య, జి.హాసిని, అండర్-17 బేస్‌బాల్ బాలికల విభాగంలో తమ్ము తనూష, పూషడపు వల్లిశ్రీ, ముమ్మారెడ్డి సిరి ఎంపికయ్యారు. అండర్-17 బాలుర విభాగంలో పి.వీరేంద్ర, అండర్-14 సాఫ్ట్‌బాల్ బాలికల విభాగంలో సబ్బినేని ఉస్మిత, నడకుదుటి జ్యోతిరాణి, కర్రి భవ్య, అండర్-14 బేస్‌బాల్ విభాగంలో తమ్ము మేఘన, ముమ్మారెడ్డి దుర్గ, పి.కోమల హరిణి, పి.జనని, పారపూడి శృనిసాయి, అండర్-14 సాఫ్ట్‌బాల్ విభాగంలో తండు రాహుల్, బి.మోహన్ ఈశ్వర్ ఎంపికయ్యారు. ఎదురుమొండి జడ్పీ పాఠశాల నుంచి అండర్-14 విభాగంలో నాయుడు లీలా మనోహర్, నాయుడు సోమేశ్వరరావు, బాలికల సాఫ్ట్‌బాల్ విభాగంలో తమ్ము జానకి, విశ్వనాథపల్లి అనూష, సీనియర్ అండర్-17 బేస్ బాల్ బాలుర విభాగంలో కైతేపల్లి సిద్ధు ఎంపికయ్యారని హెచ్‌ఎం బడే లలిత కుమారి తెలిపారు.

కె.కొత్తపాలెం హైస్కూల్‌లో..

మోపిదేవి: రాష్ట్రస్థాయి బేస్ బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలకు కె.కొత్తపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు జి.కృష్ణప్రసాద్ తెలిపారు. అండర్-17 సాఫ్ట్‌బాల్ బాలుర జట్టుకు తూము లలిత్ మణికంఠ, కొక్కిలిగడ్డ బాబీ, బాలికల విభాగంలో మత్తి రేష్మ, జంపాన హారిక ఎంపికయ్యారు. అండర్-14 సాఫ్ట్‌బాల్ బాలుర విభాగంలో కొక్కిలిగడ్డ అభి, బుర్రే సురేష్, బాలికల విభాగంలో పూషడపు జాహ్నవి ఎంపికయ్యారు. అండర్-14 బేస్‌బాల్ బాలుర విభాగంలో కొక్కిలిగడ్డ గోవర్ధన్‌బాబు, పోలిమెట్ల సిద్ధు ఎంపికయ్యారు.

మంగళాపురం హైస్కూల్‌లో..

చల్లపల్లి: సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంగళాపురం జడ్పీ విద్యార్థినీ, విద్యార్థులు వివిధ కేటగిరీల్లో 13 మంది ఎంపికయ్యారని హెచ్‌ఎం వివి.రమణ తెలిపారు.

గోగినేనిపాలెం, ఘంటసాల హైస్కూల్స్‌లో..

ఘంటసాల: రాష్ట్రస్థాయి పోటీలకు గోగినేనిపాలెం జడ్పీహైస్కూల్, ఘంటసాల జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14, అండర్-17 సాఫ్ట్‌బాల్, బేస్ బాల్ పోటీలకు గోగినేనిపాలెం పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు(బాలురు ఏడుగురు, బాలికలు ఆరుగురు) ఎంపికయ్యారని ఉపాధ్యాయిని లంకే కృష్ణకుమారి తెలిపారు. అండర్-14 వాలీబాల్, అండర్-17 గర్ల్స్ సాఫ్ట్‌బాల్, అండర్- 17 బాయ్స్ సాఫ్ట్‌బాల్ విభాగాల్లో ఘంటసాల జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం శ్రీ రంగవల్లి తెలిపారు.

క్రీడల పోటీలు ప్రారంభం

గూడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హాకీ శతవసంతాల క్రీడా వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ సంగా మధుసూదనరావు, సర్పంచ్ లింగం సులోచనారాణి విచ్చేశారు. క్రీడా పోటీలను ప్రారంభించారు. డీఎల్డీవో పద్మ, ఎంపీడీవో పి.శైలజాకుమారి, ఎంఈవో శేఖర్‌సింగ్, హాకీ సంఘ జిల్లా అధ్యక్షుడు సాయినాథ్, లింగం విజయ కుమార్, హెచ్‌ఎం విజయలక్ష్మి, పీడీలు అరుణకుమారి, రాజేష్ పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సంగా మధుసూదనరావు, సర్పంచ్ లింగం సులోచనారాణి

బాలుడిపై పోక్సో కేసు

మచిలీపట్నం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టెంపుల్ కాలనీకి చెందిన 9వ తరగతి బాలికను ప్రేమ పేరుతో వంచించి లైంగిక సంబంధం కొనసాగిస్తున్న బాలుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. కోర్టుకు హాజరుపరిచారు. నిందితుడికి 14 రోజుల రిమాండ్‌కు పంపారు.

కాలువలో కొట్టుకుపోయిన అయ్యప్ప మాలధారుడు

మచిలీపట్నం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బందరు మండలం చినయాదర పంట కాలువలో శుక్రవారం స్నానం చేస్తూ అయ్యప్ప మాలధారుడు రాసంశెట్టి సుధాకర్(21) కొట్టుకుపోయాడు. సుధాకర్ బందరులో ఐటీఐ చదువుతున్నాడు. అయ్యప్ప దీక్షలో ఉన్న సుధాకర్ స్నానానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో తండ్రి రామాంజనేయులు, సర్పంచ్ గల్లా తిమోతి కాలువలో వెతుకులాడారు. జాడ తెలియలేదు.

ఆకట్టుకున్న స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

అవనిగడ్డ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నర్సరీ పీపీ-1, పీపీ-2 తరగతులు విద్యార్థులకు నిర్వహించిన స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం ఆకట్టుకుంది. విద్యార్థులు మొదటి సెమిస్టర్‌లో నేర్చుకున్న పాఠ్యాంశాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ చందన బాబూరావు, క్లస్టర్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, మారియా, ప్రతిభ, రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

మోపిదేవి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్క్రీనింగ్ పరీక్షల ద్వారానే క్యాన్సర్ వ్యాధిని గుర్తించగలమని పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ వైద్యులు ఎన్.శ్రీరామ్ సాయి, ఆర్షియ తెలిపారు. శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహనా దినోత్సవంలో భాగంగా పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పురవీధుల్లో ర్యాలీ, అవగాహనా సదస్సు నిర్వహించారు. వైద్యబృందం ఇంటికి వెళ్లి 18 సంవత్సరాలు పైబడిన ప్రతీ వ్యక్తికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తుందని తెలిపారు. సర్పంచ్ అరజా సంధ్యారాణి, ఎంపీటీసీ సభ్యురాలు ఆశాదేవి పాల్గొన్నారు.

మండవ జానకి రామయ్యకు ఘన నివాళి

ఘంటసాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ మాజీ చైర్మన్ మండవ జానకిరామయ్య విశేష కృషి చేశారని దేవరకోట పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ అధ్యక్షుడు వేమూరి రత్నగిరి రావు పేర్కొన్నారు. శుక్రవారం పాలకేంద్రం వద్ద జానకిరామయ్య చిత్రపటానికి పాలకవర్గసభ్యులు, రైతులతో కలిసి ఆయన నివాళులర్పించారు.

పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 43 పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తున్నట్టు సమగ్ర శిక్ష ఏపీసీ కుముదిని సింగ్ తెలిపారు. శుక్రవారం లేడీయాంప్తిల్ కళాశాలలో ఆమె మాట్లాడారు. 43 పాఠశాలల్లో తొమ్మిది గ్రేడ్‌ల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. డీవైఈవో శేఖర్‌సింగ్, అబ్దుల్ సుభాన్, సీతామహాలక్ష్మి, నగేష్, రామకృష్ణ, పద్మజ, డైట్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ఎన్జీ రంగా చిత్రపటానికి, మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కూటమి నేతలు

మహనీయుడు ఎన్జీ రంగా

అవనిగడ్డ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎంతో మందిని నాయకులను తయారుచేసిన గొప్ప నాయకుడు ఎన్జీ రంగా అని నియోజకవర్గ యువనాయకుడు మండలి వెంకట్రామ్ అన్నారు. వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు, ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతి వేడుకలను గాంధీక్షేత్రం, గ్రామీణ యువజన వికాస సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అవనిగడ్డలో ఘనంగా నిర్వహించారు. వందేమాతరం గీత రచయిత బంకించంద్ర చటర్జీ, ఎన్జీ రంగా చిత్రపటాలకు వెంకట్రామ్ నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ, మండల అధ్యక్షుడు లింగం బాబూరావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ పుప్పాల యేసు, న్యాయవాది బొప్పన వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షుడు మత్తి నాగమలేశ్వరరావు పాల్గొన్నారు.

ఘంటసాలలో..

ఘంటసాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా జయంతిని కృషి విజ్ఞాన కేంద్రం వద్ద ఘనంగా నిర్వహించారు. ఎన్జీ రంగా చిత్రపటానికి కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డి.సుధారాణి నివాళులర్పించారు. శాస్త్రవేత్తలు నవీన్, రేవతి, మంజువాణి, డాక్టర్ వెంకటలక్ష్మి, యశ్వంత్ కుమార్ పాల్గొన్నారు. ఘంటసాల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఎన్జీ రంగా విగ్రహానికి జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ నివాళులర్పించారు. డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరరావు, కార్యదర్శి జయలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్థులు, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. గోగినేనిపాలెంలో హైస్కూల్‌లో ఎన్జీ రంగా చిత్రపటానికి హెచ్‌ఎం కృష్ణకుమారి, కుంపటి ప్రవీణ్, ఉపాధ్యాయులు నివాళులర్పించారు.



ఎన్జీ రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ